## ముగిసిన దేవీ నవరాత్రులు



7




ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఖమ్మం

KHAMMAM

ఆదివారం 5 అక్టోబరు 2025





## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

- కల్యాణంలో పాల్గొన్న 92 మంది జంటలు

7

భక్తులతో పోటెత్తిన జమలాపురం ఆలయం

# మండలానికి ముగ్గురు



- అధికార పార్టీ ఆశావహుల జాబితా సిద్ధం!
- గోప్యంగా ఇన్‌చార్జ్ మంత్రి చేతికి..
- ఎమ్మెల్యేల సిఫార్సులు
- జడ్పీటీసీ టికెట్ కోసం పైరవీలు

ఖమ్మం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'స్థానిక' సంస్థల ఎన్నికల సందడి మొదలైన వేళ.. ఉమ్మడి జిల్లాలో అభ్యర్థిత్వాల ఎంపికపై అధికార పార్టీ తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రాదేశిక నియోజక వర్గాలకు సంబంధించి ఆ పార్టీలోని ఆశావహుల జాబితాలు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి చేతికి చేరాయి. ఆదివారం నాటికి ఇన్‌చార్జ్ మంత్రుల వద్దకు జాబితాలు పంపాలని అధిష్ఠానం ఆదేశించిన నేపథ్యంలో.. శనివారం నుంచే మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని జడ్పీటీసీ ఆశావహుల జాబితాలను సీల్డ్‌కవర్‌లో పంపారు. మండలానికి ముగ్గురు చొప్పున ఆశావహుల పేర్లను అందులో పొందు పరిచినట్టు సమాచారం. అయితే కొన్ని నియోజకవర్గాలకు సంబంధించిన జాబితాలు ఆదివారం అందనున్నట్టు తెలుస్తోంది.

### జాబితాల్లో ముగ్గురు పేర్లు..

ఖమ్మం జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాలకు 60 మంది పేర్లు, భద్రాద్రి జిల్లాలో 20జడ్పీటీసీలకు 60 మంది పేర్ల జాబితా పంపించాలని అధిష్ఠానం సూచించింది. అయితే అభ్యర్థిత్వానికి అన్ని విధాలా అర్హత ఉన్న అభ్యర్థి పేరు మొదటి పేరుగా సూచించి.. మరో రెండు పేర్లను డమ్మీగా సూచిస్తున్నారు. కొన్ని మండలాల్లో ఆశావహులు అధికంగా ఉండడంతో నేతల సిఫారసులకు డిమాండ్ ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జడ్పీచైర్మన్ జనరల్ కావడం, ఖమ్మం జడ్పీ ఎస్టీకి రిజర్వుకావడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన గిరిజన నాయకులు తటస్థులు కూడా జడ్పీ చైర్మన్ పదవిని దృష్టిలో ఉంచుకుని జడ్పీటీసీ టికెట్‌కోసం పైరవీలు సాగిస్తున్నారు. భద్రాద్రి జనరల్ కావడంతో అక్కడ చైర్మన్ పదవిపై పలువురి దృష్టి ఉంది. అయితే అక్కడ జడ్పీటీసీ స్థానాలు జనరల్ కేవలం మూడు చోట్ల ఉండగా, దుమ్ముగూడెం, (మిగతా 6వ పేజీలో)

# వ్యవసాయం పండుగవ్వాలి





మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సన్మానిస్తున్న రైతులు

- ఆ దిశగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది
- 31జిల్లాల్లో 10లక్షల ఎకరాల్లో పామాయిల్ విస్తరణ
- ప్రతీ జిల్లాలో ఫ్యాక్టరీల నిర్మాణంతో మరింత ప్రోత్సాహం
- పామాయిల్‌తోనే దేశంలో నూనె లోటును పూడ్చగలం
- జాతీయ ఉపాధి హామీ పథకానికి అనుసంధానించేలా కేంద్రాన్ని కోరతాం
- కార్బన్ క్రెడిట్స్ కొనుగోలు ద్వారా అదనపు ఆదాయం
- తెలుగు రాష్ట్రాల పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పాల్గొన్న ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఎమ్మెల్యేలు జారే, కూనంనేని

అశ్వారావుపేట/దమ్మపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం పండుగ కావాలని.. ఆ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ముఖ్యంగా పామాయిల్ విస్తరణ ద్వారా దేశంలో నూనె లోటును తీర్చొచ్చని వ్యవసాయ, ఉద్యాన పట్టుపరిశ్రమల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం దమ్మపేట మండలం లింగాలపల్లి సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన తెలంగాణా ఆయిల్‌పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలస్థాయి పామాయిల్ రైతుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో రూ.లక్షన్నర కోట్ల విలువైన నూనెను దేశీయ అవసరాల కోసం దిగుమతి చేసుకుంటున్నామని, ఆ అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం పామాయిల్‌ను ప్రోత్సహిస్తోందన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలోని 31జిల్లాలో వచ్చే మూడేళ్లలో 10లక్షల ఎకరాల్లో పామాయిల్ తోటలను విస్తరించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉద్యాన పంటలతో, పామాయిల్‌లో అంతర పంటలను పండించడం ద్వారా పామాయిల్ రైతుల స్థితి గతులు పూర్తిగా మారి పోతున్నాయని, లాభదాయకమైన పంటలను సాగు చేయటంలో రైతులు ముందుండాలని తుమ్మల సూచించారు. 15వేల ఎకరాల్లో పామాయిల్ తోటలు విస్తరించిన ప్రతీ చోట పామాయిల్ కర్మాగారాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన సిద్దిపేటలోని నర్మెట్ వద్ద నిర్మించిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించనున్నామన్నారు. త్వరలోనే మరో 11 కొత్త ఫ్యాక్టరీలు నిర్మించనున్నట్టు తెలిపారు. జనవరిలో ఖమ్మం జిల్లా కొణిజర్ల పామాయిల్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తామని, కల్లూరుగూడెం ప్రాజెక్టును ఈ ఏడాది పూర్తిచేస్తామని, ఆ తరువాత అశ్వారావుపేటలో మరో కొత్త ఫ్యాక్టరీ నిర్మాణానికి శ్రీకారం చుడతామని ప్రకటించారు. పామాయిల్ రైతులకు కార్బైడ్స్ కొనుగోలు ద్వారా కేంద్రం నుంచి అదనపు ఆదాయం వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ ఏడాది నుంచి సంవత్సరానికి రెండు లక్షల (మిగతా 6వ పేజీలో)



సమావేశానికి హాజరైన ఆయిల్‌పామ్ రైతులు

## ఏఐ ప్రోగ్రామింగ్‌లో ఆరెంపుల యువతి సత్తా

### ప్రధాని మోదీ నుంచి ఆల్ ఇండి ట్రేడ్ టాపర్ అవార్డు అందుకున్న పల్లవి

ఖమ్మంరూరల్, అక్టోబర్ 4(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో ఆల్ ఇండియా ట్రేడ్ టాపర్‌గా ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామానికి చెందిన యువతి తాళ్లూరి పల్లవి సత్తా చాటింది. ఈ క్రమంలో శనివారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ నుంచి ఆమె అవార్డు అందుకుంది. యువతలో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ప్రధానమంత్రి సేతు పథకాన్ని రూ.60వేల కోట్లతో ప్రారంభించారు. దీనిలో భాగంగానే అత్యుత్తమ నైపుణ్యం కనపరిచిన పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు అవార్డులను అందజేశారు. ఈ క్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో ఆల్ ఇండియా ట్రేడ్ టాపర్‌గా ఎన్నికైన తాళ్లూరి పల్లవికి ప్రధాని అవార్డును అందజేశారు. ఆరెంపుల గ్రామానికి చెందిన తాళ్లూరి రవి, అజిత దంపతుల మొదటి కూతురైన పల్లవి రూరల్ మండలం పొన్నెకల్ పరిధిలోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సీఈసీ పూర్తి చేసింది. అనంతరం ఏడాది పాటు హైదరాబాద్‌లో ఏఐ గ్రూప్‌పై కోచింగ్ తీసుకుంది. తండ్రి రవి ప్రైవేట్ ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తుండగా తల్లి గృహిణి. తమ కూతురు ఇలా దేశఖ్యాతి సంపాదించడం పట్ల పల్లవి తల్లిదండ్రులు తాళ్లూరి రవి, అజిత ఆనందం వ్యక్తం చేశారు.



ప్రధాని మోదీ నుంచి అవార్డు అందుకుంటున్న పల్లవి

### పల్లవికి భట్టి, పొంగులేటి అభినందనలు

తాళ్లూరి పల్లవి ఏఐలో సత్తా చాటడంతో జిల్లా ప్రజలు గర్విస్తున్నారని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో అభినందనలు తెలిపారు. జిల్లా యువతి జాతీయ స్థాయిలో సత్తా చాటడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆమెను ఆదర్శంగా చేసుకుని యువత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శాస్త్రసాంకేతిక రంగాల్లో ప్రతిభను చాటాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పల్లవి తల్లిదండ్రులు రవి, అజితను కూడా అభినందించారు.

## డిసెంబరు 26న ఖమ్మంలో సీపీఐ శతజయంత్యుత్సవాల ముగింపు సభ

- హాజరవనున్న జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, దక్షిణాది రాష్ట్రాల సీపీఐ జాతీయ కార్యదర్శులు
- సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు బాగం హేమంతరావు

6

## ఖరారు కాని 'సీసీఐ' కొనుగోళ్ల షెడ్యూల్

### జిన్నింగ్ మిల్లులతో కుదరని ఒప్పందం

ఖమ్మం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పత్తి కొనుగోళ్లకు సంబంధించిన షెడ్యూల్ ఇంకా జిల్లాలో ఖరారుకాలేదు. సీసీఐ జిన్నింగ్ మిల్లుల మధ్య టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తికాకపోవడంతో ఈ ప్రభావం పత్తి కొనుగోలుపై పడుతుంది. జిల్లా మార్కెటింగ్‌శాఖ పత్తి కొనుగోలుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినా వ్యవసాయశాఖ క్రాప్ బుకింగ్ డేటా ప్రక్రియ ఇంకా పూర్తిచేయకపోవడం, మరోవైపు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) జిన్నింగ్ మిల్లులతో టెండర్ల ఒప్పందం పూర్తికాకపోవడంతో పత్తి కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభమవుతాయన్న విషయం మిస్టరీగానే ఉంది. ఇప్పటికే జిల్లాలో కొన్ని మండలాల్లో పత్తి తీస్తున్నారు. దీపావళి నాటికి పత్తి ముమ్మరంగా వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం అడపా దడపా రోజు కురుస్తున్న వర్షాలు పత్తిపై తేమ ప్రభావం చూపుతున్నాయి. జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో జిన్నింగ్ మిల్లులున్న చోట పత్తి కొనుగోళ్లు ప్రారంభించాల్సి ఉంది.

ఖమ్మం జిల్లాలో 5 చోట్ల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 4 చోట్ల మాత్రమే సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరవాలని నిర్ణయించారు. అయితే ఇప్పటివరకు టెండర్లు పూర్తికాకపోవడంతో పాటు వ్యవసాయశాఖ క్రాప్‌డేటాను పూర్తిచేయలేదు. యూరియా ఇబ్బందులు, ప్రతిరోజు కురుస్తున్న వర్షాలతో మండల, గ్రామస్థాయి వ్యవసాయాధికారులు గ్రామాలకు వెళ్లి పంటల సర్వేను చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన కపాస్‌కిసాన్ యాప్ ద్వారా రైతుల పేర్లు, వారు ఎంతమొత్తంలో పంటలు వేశారు. పత్తిసాగు విషయంతో పాటు సీసీఐ కొనుగోలు కేంద్రానికి వెళ్లాలంటే ముందుగా స్లాట్‌బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ యాప్‌ను ప్రతిరైతు డౌన్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత స్లాట్‌ప్రకారం పత్తి అమ్మాలి. వ్యవసాయశాఖ చేసిన సర్వే మార్కెటింగ్, సీసీఐకి కూడా డేటా అనుసంధానం అవుతుంది. గతంలో వలే వ్యవసాయాధికారులు మాన్యువల్ పద్ధతిలో రాసిపంపడం కాకుండా కపాస్ యాప్‌లో తప్పనిసరిగా స్లాట్‌బుకింగ్‌తోనే పత్తి అమ్మే పరిస్థితి ఉంది. వ్యవసాయశాఖ సర్వే పూర్తికాకపోవడం, సీసీఐ జిన్నింగ్ మిల్లులతో టెండర్లు పూర్తిచేయకపోవడంతో పత్తి కొనుగోలుపై ఇంకా షెడ్యూల్ ఎప్పుడన్నది తేల్చలేకపోతున్నారు. ఈ ఏడాది క్వింటాకు పత్తి రూ.8060, రెండోరకం రూ.8010లుగా కేంద్రం నిర్ణయించింది. ఈ ధర ప్రకారం సీసీఐ కొనుగోలు చేయాలి. ఇప్పటికైనా సీసీఐ టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని, పంట చేతికి రాగానే పత్తి కొనుగోలు ప్రారంభించాలని రైతాంగం కోరుతోంది.

भा.क.नि.

C.C.I.

# అరుణ వర్ణం.. మనసు పరవశం..





నీలాకాశం అరుణ వర్ణం పులుముకుంది. చిరుజల్లులు పడుతున్న వేళ ఖమ్మంలో సాక్షాత్కరించిన ఈ దృశ్యం మనసులను పరవశింపజేసింది. శనివారం సాయంత్రం భారీ వర్షం పడిన అనంతరం నగరంలో ఆకాశం ఎర్రగా మారి ప్రకృతి రమణీయతను రెట్టింపు చేసింది.

- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

# రైతులకు మద్దతు ధర కల్పించాలి

**పత్తి కొనుగోళ్లపై ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ, వాట్సాప్ నెంబర్లు**

**ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**

**కపాస్ కిసాన్ యాప్‌పై అధికారులకు శిక్షణ**

**టోల్‌ఫ్రీ : 1800 599 5779, వాట్సాప్ నెంబరు 8897281111**



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): 'పత్తి, ధాన్యం పండించిన రైతులకు మద్దతు ధరను కల్పించాలి. దీనికోసం ప్రత్యేక శ్రద్ధ చూపాలి' అని ఖమ్మం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. వానాకాలం ధాన్యం, పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కపాస్ కిసాన్ యాప్‌పై శనివారం అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వానాకాలంలో ఖమ్మం జిల్లాలో 2.60లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యంగా ఉందన్నారు. సన్నధాన్యం కొనుగోలుతో పాటు 3 నుంచి 4 నెలల్లో మిల్లింగ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. తూర్పార పట్టిన తర్వాతే రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన యంత్రాలను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతీ క్లస్టర్ పరిధిలో ధాన్యాన్ని ఏఈవోలు ధ్రువీకరించాలని, ధాన్యం కోతలు క్రమపద్ధతిలో జరిగేలా పర్యవేక్షించాలన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రం పరిధిలో అవసరమైన గన్నీ బ్యాగులు వారికి కేటాయించిన మిల్లుల నుంచి తీసుకోవాలని, అవసరమైన టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కొనుగోలు కేంద్రాల వద్దకు మిల్లర్లను అనుమతించవద్దని, పత్తి కొనుగోలు సులభతరంచేసే కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సూచించారు. మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో పత్తి ధర పడిపోతున్న నేపథ్యంలో కనీస మద్దతు ధర చెల్లించి సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. నాణ్యమైన పత్తి 8శాతం తేమ క్వింటాకు రూ.8,110 ధరను చెల్లిస్తోందన్నారు. తేమ శాతంపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని, రైతులు మార్కెట్‌కు వచ్చి ఇబ్బంది పడకుండా ఇంటి నుంచే స్లాట్ బుక్ చేసుకునేలా కపాస్ కిసాన్ యాప్‌లో సదుపాయాన్ని కల్పించామన్నారు. కొనుగోలుకు సంబంధించి రైతులు టోల్‌ఫ్రీ, వాట్సాప్ నెంబర్లలో సంప్రదించొచ్చన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీం, జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం శ్రీలత, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

## కపాస్ కిసాన్ యాప్ నిర్వహణపై
# వ్యవసాయ విస్తరణ అధికారులకు శిక్షణ

కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పత్తి కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొత్త మార్గదర్శకాలు తెచ్చిందని, కపాస్ కిసాన్ యాప్ రైతులకు సమగ్ర సమాచార వేదికగా నిలుస్తుందని వరంగల్ ప్రాంతీయ మార్కెటింగ్ ఉప సంచాలకురాలు పద్మావతి అన్నారు. శనివారం ఐడీవోసీ కార్యాలయంలో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కపాస్ కిసాన్ యాప్ నిర్వహణ తీరుతెన్నులు, స్లాట్ బుకింగ్, కౌలు రైతులు రిజిస్ట్రేషన్‌పై అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ.. ఈ యాప్ ద్వారా రైతులు పత్తి అమ్మకాలు, రోజువారీ మార్కెట్ ధరలు, పంటల తూకం, నగదు చెల్లింపు సమాచారాన్ని సులువుగా తెలసుకోవచ్చాన్నారు. పత్తి కొనుగోలులో పారదర్శకత రైతులకు సమయానికి న్యాయమైన ధరలు అందేలా చర్యలు, రైతుల శ్రేయస్సు దృష్ట్యా పత్తి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు యాప్ దోహద పడుతుందన్నారు. రైతులందరి వివరాలను యాప్ నమోదు చేయాలన్నారు. ఈ విధంగా నమోదు చేసుకున్న రైతులు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు కేంద్రాల్లో తమ సరుకును విక్రయించుకునే వెసులుబాటు ఉంటుందని, ఈ నూతన కార్యక్రమంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ అధికారులకు సూచించారు. డీఏవో బాబురావు మాట్లాడుతూ.. డిజిటల్ టెక్నాలజీ వినియోగంతో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ సేవలు రైతుల దరిచేరుతాయన్నారు. జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్ మాట్లాడుతూ.. ఈ యాప్ ద్వారా రైతులు పత్తిని సీసీఐ కేంద్రంలో విక్రయించాలో వివరాలు తెలుపుతూ సమాచారాన్ని అందిస్తుందన్నారు. ఇలా చేయడం ద్వారా నిరీక్షించాల్సిన బాధ రైతులకు ఉండదన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న రైతులకే ఈ వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ ప్రతినిధులు ఏడీఏలు, ఏఈవోలు, ఏంఏవోలు, మార్కెటింగ్ సిబ్బందికి యాప్ వినియోగం, తీరుతెన్నులను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏలు శోభన్‌బాబు(టెక్నికల్), సుధాకర్‌రావు (భద్రాచలం), తాతారావు(మణుగూరు), 20మంది ఏవోలు, 67మంది ఏఈవోలు, మార్కెటింగ్ ఏఎంసీ సెక్రటరీలు, అధికారులు పాల్గొన్నారు.



ఖమ్మం నగరంలో కురుస్తున్న వర్షం

# ఉదయం ఎండ... సాయంత్రం వాన

**● ఖమ్మం నగరంలో దంచికొట్టిన వాన ● జలమయమైన పలు రోడ్లు**

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లాలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా ఉంది. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. సాయంత్రం 3గంటల నుంచి సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం పడింది. ఖమ్మం నగరంతో పాటు 10మండలాల్లో భారీ వాన పడింది. ఖమ్మం నగరంలోని బైపాస్‌రోడ్డు, మయూరిసెంటర్ తదితర రోడ్లు జలమయమయ్యాయి. జిల్లాలో 11.6 మిల్లీ మీటర్ల సగటు వర్షపాత నమోదవగా.. ఖమ్మం రూరల్ మండలంలో అత్యధికంగా 89.5 మి.మీ, కామేపల్లిలో 73, తిరుమలాయపాలెంలో 18.1, ఖమ్మం అర్బన్‌లో 15.4. కొణిజర్లలో 12.8, సింగరేణిలో 12.5, రఘునాథపాలెంలో 7.7, ఏన్కూరులో 6.4, వైరాలో 5.2, కూసుమంచిలో 1.8, తల్లాడలో 0.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం పత్తి చేతికొచ్చే సమయం కావడంతో కాయలు పగులుతున్నాయని, వాటిలో నీళ్లు చేరి గుడ్డుబారిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# స్థానిక ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటుదాం..

**సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా**



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎస్కే సాబీర్ పాషా

గుండాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పోటీలో ఉన్న ప్రతీ సీపీఐ అభ్యర్థిని గెలిపించుకొని స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. గుండాల మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దశాబ్దాలుగా గుండాలలో సీపీఐ ప్రజల పక్షాన ఉందని, పోడు పట్టాల పోరాటంలో ఎనలేని కృషి చేసిందన్నారు. ఈ సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే శతజయంతి ముగింపు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. మోకాళ్ల సమ్మయ్య, ఎస్కే సాహెబ్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి సీపీఐలో చేరిన 30 కుటుంబాలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరరెడ్డి పుల్లారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు రేసు ఎల్లయ్య, ఉప్పుశెట్టి రాహుల్, వాగబోయిన రమేష్, కొమరం హనుమంతు, షాహిద్, ఎస్కే సమీర్, బచ్చల రామయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

# సేవలు అందించడమే పోలీస్ శాఖ లక్ష్యం

**భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్**



గ్రామ ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఏఎస్పీ విక్రాంత్ సింగ్, తదితరులు

చర్ల, అక్టోబర్ 4 ఆంధ్రజ్యోతి) పేదల కోసం పోలీస్ శాఖ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్ గుర్తుచేశారు. శనివారం చర్ల మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన బట్టిగూడెం, బత్తినపల్లి, రాంచంద్రాపురం గ్రామాలను ఆయన సందర్శించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ అటవీ గ్రామాల్లో నివాసం ఉండే పేదలకు విద్య, వైద్యం, మౌళిక సదుపాయాలు కల్పించడమే పోలీస్‌శాఖ లక్ష్యం అన్నారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులను రానివద్దని సూచించారు. మావోయిస్టులను సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాలు కురుస్తున్న నేపధ్యంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మూడు గ్రామాల ప్రజలను నెస్లే కంపెనీ అందించిన నిత్యావసర సరుకులను ఏఎస్పీ అందజేశారు. ఆయన వెంటన చర్ల సీఐ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవా, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ కమాండర్ సెబాస్టియన్ తదితరులు ఉన్నారు. కాగా గ్రామాలకు రోడ్లు లేక పోవడంతో వాగులు దాటుతూ ఏఎస్పీ గ్రామాలకు చేరుకున్నారు.

# గద్వాల జిల్లాలో పాల్వంచ యువతి ఆత్మహత్య

**» కానిస్టేబుల్ ప్రేమించి మోసగించడమే కారణం**

**» 22మందిపై కేసు నమోదు చేసిన గట్టు పోలీసులు**

పాల్వంచ, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ఓ కానిస్టేబుల్ ప్రేమించి పెళ్లికి నిరాకరించడాన్ని తట్టుకోలేక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువతి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన గద్వాల జిల్లా గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామంలో జరగ్గా.. అక్కడి పోలీసులు శనివారం 22మందిపై కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలివీ.. గద్వాల జిల్లా గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ రఘునాథ్‌గౌడ్, పాల్వంచ మండలం దంతెలబోర ఎస్సీ కాలనీకి చెందిన కోలేటి ప్రియాంక(25)కు హైదరాబాద్‌లో పరిచయం ఏర్పడింది. ఆతర్వాత నాలుగు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో తనను ప్రేమించి పెళ్లిచేసుకుంటానని మోసం చేశాడంటూ మూడునెలల క్రితం ప్రియాంక రఘునాథ్‌గౌడ్,అతనికుటుంబ సభ్యులపై ప్రియాంక గట్టుపోలీసులకు పిర్యాదు చేయగా.. మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే రఘునాథ్‌గౌడ్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు.అప్పటికీ తనకు న్యాయం జరగలేదని భావించిన ప్రియాంక చిన్నోనిపల్లిలో అతడి ఇంటి ఎదుట 20రోజుల నుంచి నిరాహారదీక్ష చేస్తోంది. శుక్రవారం సాయంత్రం కూడా ప్రియాంక తన తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడింది. రాత్రి సమయంలో అక్కడి వారు తండ్రి రాంబాబుకు ఫోన్ చేసి, ప్రియాంక పరుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిందని, ఆమెకు సీరియస్‌గా ఉందని, ఆసుపత్రికి తరలిస్తున్నామని చెప్పారు. దాంతో ప్రియాంక తల్లింద్రులు దంతెలబోర నుంచి బయల్దేరి.. వారు అసుపత్రికి చేరుకునే సరికి ప్రియాంక మృతి చెందిందని మళ్లీ సమాచారం అందించారు. తమ కుమార్తె మృతికి రఘునాథ్‌గౌడ్, అతడితల్లిదండ్రులు, బంధువులే కారణమని ప్రియాంక తల్లి ఆదిలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు రఘునాథ్‌గౌడ్, అతని కుటుంబ సభ్యులు, బంధువులు మొత్తం 22మందిపై కేసు నమోదు చేశారు.

# వ్యవసాయం పండుగవ్వాలి..

(5వ పేజీ తరువాయి)

ఎకరాల చొప్పున 10లక్షల ఎకరాల్లో పామాయిల్‌ను విస్తరించనున్నట్టు తెలిపారు.

**రూ.25వేల మద్దతు ధర కోసం కేంద్రంపై ఒత్తిడి**

జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ఉద్యాన పంటలను అనుసంధానం చేయాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు. పామాయిల్‌కు టన్నుకి రూ.25వేలు కనీసమద్దతు ప్రకటించేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామని, తగ్గితే దానిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని కోరుతున్నట్టు తుమ్మల తెలిపారు. పామాయిల్ యాజమాన్య పద్ధతులు బాగుంటే ఎకరానికి 17 టన్నుల వరకు సాధించవచ్చన్నారు. దమ్మపేట మండలంలోని మల్కారానికి చెందిన ఎస్సీ రైతు వెంకట్రావు, లింగాలపల్లికి చెందిన గిరిజన రైతు సోయం నారాయణ నిరూపించారన్నారు. పామాయిల్‌లో మెకడామియా, జాజి, వక్క, అవకాడోలాంటి ఉద్యాన పంటలు వేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందేందుకు కృషి చేయాలన్నారు. మొదటి మూడేళ్లలో కూడ అనేక రకాల అంతర పంటలు వేసుకోవచ్చునన్నారు. రైతుల మేలు కోసం ఇప్పటికే లక్షన్నర కోట్లను తెలంగాణ ప్రభుత్వం వెచ్చించిందని, ఇంక ఎంతైన ఖర్చు పెట్టేందుకు వెనుకాడబోమన్నారు. యూరియా మన దేశంలో 30శాతం మాత్రమే లభిస్తుందని, 70 శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందన్నారు. ప్రపంచంలో అనేక దేశాలలో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఓడలు తిరిగి రావాల్సి రావడంతో మూడు నెలలు ఆలస్యంగా దేశంలోకి యూరియా వచ్చిందని వివరించారు. అనంతరం ఆయిల్ పామ్ అభివృద్ధికి చేస్తున్న కృషికి గాను మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయిల్ పామ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఘనంగా సత్కరించారు. అలాగే సమావేశానికి సహకరించిన పామాయిల్ రైతులు మద్దినేని వెంకట్ దంపతులు, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి, పలువురు రైతులను సత్కరించారు.

**ఆయిల్ ఫెడ్‌తోనే రైతుల అభివృద్ధి : జంగారాఘవరెడ్డి, ఆయిల్‌ఫెడ్ చైర్మన్**

ఆయిల్‌పామ్‌తోనే రైతుల ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధ్యమని ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా రైతులు పామాయిల్ సాగుతోనే ఆర్థికంగా అభివృద్ధి చెందారని, వారి స్ఫూర్తితోనే వరంగల్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులు పామాయిల్ తోటలు వేసుకొని ఆర్థికంగా అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. పామాయిల్ పంటకు రాష్ట్రంలో ఆద్యుడైన తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ఉండటం అదృష్టమని, నిత్యం రైతును ఏ విధంగా అభివృద్ధి చేయాలనే తపనతోనే ఆయన పనిచేస్తారన్నారు. తుమ్మల అంటేనే పామాయిల్, పామాయిల్ అంటేనే తుమ్మల అనే విధంగా.. కేంద్రంతో నిత్యం సంప్రదింపులు చేస్తున్న మంత్రి తుమ్మలకు రుణపడి ఉన్నామన్నారు. ఆలపాటి రామచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ రైతు సంఘం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు నిత్యం కలసి లేఖలు అందించడం ద్వారా పామాయిల్ ధరలు, రాయితీల సాధన, ఫ్యాక్టరీల నిర్మాణాలు, నర్సరీలలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవడంలో ముందున్నారన్నారు.



మాట్లాడుతున్న ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఎమ్మెల్యేలు జారే, కూనంనేని

**వ్యవసాయంపై పట్టున్న తుమ్మల వ్యవసాయ శాఖ మంత్రి కావడం అదృష్టం ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, కూనంనేని సాంబశివరావు**

వ్యవసాయం కుటుంబం నుంచి రావడమే కాకుండా ఇంత బిజీషెడ్యూల్‌లో కూడా స్వయంగా వ్యవసాయం చేయడంతో పాటు ప్రతీ రైతు అభివృద్ధి చెందాలనే తపనతో ఉండే తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయశాఖ మంత్రిగా ఉండటం అందరి అదృష్టమని అశ్వారావుపేట, కొత్తగూడెం ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, కూనంనేని సాంబశివరావు అన్నారు. ఉమ్మడి జిల్లాలో పామాయిల్ విస్తరించిందంటే ప్రతీ అడుగులో తుమ్మల మార్కు కనిపిస్తుందని, ఏప్రభుత్వంలో ఉన్న ఏశాఖలో ఉన్న పామాయిల్ అభివృద్ధికి ఆయన చేసిన కృషి అమోఘమన్నారు. ఆయిల్‌ఫెడ్‌లో మంచి ఓఈఆర్ వచ్చేలా చేసి, ఆ ఓఈఆర్ ఆధారంగానే పామాయిల్ ధరను వచ్చేలా తుమ్మల కృషి చేశారన్నారు. ఈ సమావేశంలో టీఎస్ ఆయిల్ పామ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు,దమ్మపేట,నారాయణపురం సొసైటీల చైర్మన్లు ఎల్లిన రాఘవరావు, నిర్మల పుల్లారావు, ఏఎంసీ చైర్మన్ వాసం రాణి, పామాయిల్ రైతులు బండి భాస్కరరావు, పైడి వెంకటేశ్వరరావు, దొడ్డప్రసాద్,కాసాని నాగప్రసాద్, కొయ్యల అచుతరావు, కేవీ సత్యనారాయణ, వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆలపాటి



తెలంగాణ ఆయిల్‌పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా దమ్మపేట మండలం అల్లిపల్లికి చెందిన ఆలపాటి రామచంద్ర ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం లింగాలపల్లిలో జరిగిన ఆయిల్‌పామ్ రైతుల సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. 40ఏళ్లుగా పామాయిల్ సాగు విస్తరణకు విశేష కృషి చేసి, ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుంటూ ఆయిల్‌పామ్ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించిన ఆలపాటి రామచంద్రప్రసాద్ మరో సారి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికవడం పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ మంత్రి తుమ్మల సహకారంతోనే పామాయిల్ అభివృద్ధి, సమస్యల పరిష్కారంకోసం కృషి చేస్తున్నానని, తుమ్మల హయాంలోనే పామాయిల్ విస్తృతంగా అభివృద్ధి చెందిన విషయాన్ని ఆయన వివరించారు.

# మండలానికి ముగ్గురు!

(5వ పేజీ తరువాయి)

గుండాల జనరల్, ఆళ్లపల్లి జనరల్ మహిళకు రిజర్వు అయ్యాయి. దీంతో ఈ మూడు నియోజకవర్గాల నుంచే ఎవరు పోటీ చేసి గెలిచినా వారికే జడ్పీ చైర్మన్ పదవి జనరల్ కోటాలో దక్కే అవకాశం ఉంది. ఒకవేళ ఇతరులకు ఇవ్వాలనుకుంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ నుంచి కూడా చైర్మన్ చేసే అవకాశం ఉంటుంది. ఖమ్మం జడ్పీ చైర్మన్ ఎస్టీ కావడంతో ఎస్టీలకు రిజర్వుచేసిన నియోజకవర్గాల్లో డిమాండ్ ఉంది. కూసుమంచి, తిరుమలాయపాలెం, కొణిజర్ల, సత్తుపల్లి నియోజకవర్గాల నుంచి ఎవరు జడ్పీటీసీగా గెలిచినా జడ్పీ చైర్మన్ పదవి సొంతం చేసుకోవచ్చు. దీంతో గత ఎన్నికల్లో అసెంబ్లీ టికెట్లు ఆశించి టికెట్ దక్కని నేతలతోపాటు కొత్తగా పలువురు ఈ పదవిపై దృష్టిపెట్టి గిరిజనులు టికెట్లు ఆశిస్తున్నారు దీంతో ఎస్టీకి రిజర్వు అయిన నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేల సిఫార్సుకోసం ప్రయత్నాల్లో ఉన్నారు. మంత్రి పొంగులేటి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరునుంచి రెండు జడ్పీటీసీ స్థానాలు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న వైరా నియోజకవర్గంలో ఒకటి, సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఒకటి ఉండడంతో వీరి సిఫార్సుతోనే ఎస్టీ కేటగిరిలో ఒకరికి అవకాశం లభించనుంది. దీంతో అందరి చూపు మూడు నియోజకవర్గాల పైనే ఉంది. మొత్తం మీద అధిష్టానం ఆశావహుల జాబితాను అడగడంతో కాంగ్రెస్‌లో టికెట్ల వేడి మొదలైంది. అయితే అంతా ఆశావహుల జాబితాను ఎమ్మెల్యేలు రహస్యంగా ఉంచుతున్నారు. ఎవరి పేరును సూచించడం లేదు. ప్రతీ జడ్పీటీసీ ప్రాదేశిక నియోజకవర్గం నుంచి ముగ్గురి పేర్లు సిఫారసు చేసినట్టు సమాచారం.

## డిసెంబరు 26న ఖమ్మంలో సీపీఐ
# శతజయంత్యుత్సవాల ముగింపు సభ

**హాజరవనున్న పలువురు జాతీయ నేతలు**

**సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు బాగం హేమంతరావు**



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు బాగం హేమంతరావు

ఖమ్మం, అక్టోబరు4(ఆంధ్రజ్యోతిప్రతినిధి): సీపీఐ శతజయంత్యుత్సవాల ముగింపు సభను డిసెంబరు 26న ఖమ్మంలో ఘనంగా నిర్వహిం చబోతున్నామని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యు డు బాగం హేమంతరావు వెల్లడించారు. ఖమ్మంలో సీపీఐ కార్యాలయలో శనివారం ఏర్పా టుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో జరిగే సీపీఐ శత జయం త్యుత్సవాల ముగింపుసభ ఎంతో చరిత్రాత్మకమ ని, ఈ సభకు జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజాతో పాటు దక్షిణాది రాష్ట్రాల సీపీఐ జాతీ య కార్యదర్శులు కె.నారాయణ, బినో య్ విశ్వం, కూనంనేని సాంబశివ రావు, పల్లా రాజేశ్వరరెడ్డి, అజీజ్‌పాషా, చాడా వెంకటరెడ్డి, రామకృష్ణ, తదితరులు హాజరవుతారన్నారు. సీపీఐ శతజయంత్యుత్సవ సభను జయప్రదం చేసేందుకు ఆదివారం ఖమ్మంలో సన్నాహక సమావేశం నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ విలేక రుల సమావేశంలో సీపీఐ ఖమ్మం జిల్లా కార్య దర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితిసభ్యులు ఎర్రాబాబు, ఎస్‌కే జానీమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్ పాల్గొన్నారు.

# గూడ్స్ రైలు ఢీ: ఎనిమిది గేదెల మృత్యువాత

చంద్రుగొండ,అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేపల్లెవాడ శివారులో శనివారం సాయింత్రం గూడ్స్‌రైలు ఢీకొన్న ప్రమాదంలో ఎనిమిది గేదెలు మృతి చెందాయి. ఈ ఘటపై స్థానికులు, బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంపురం గ్రామంలోని ఏడుగురు రైతుల ఎనిమిది గేదెలను గ్రామ శివారు అడవిలోకి మేతకు తోలుకు పోయారు. సాయింత్రం ఇంటికి తోలుకు వస్తుండగా మార్గమధ్యలో రైలు కట్టపై నుంచి దాటుతున్న సమయంలో బొగ్గురవాణ చేస్తున్న గూడ్స్ రైలు వీటిని ఢీకొట్టింది. ఈ ఘటనలో గేదెలు చనిపోయాయి. వీటివిలువ రూ.6లక్షలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. రైల్వే అధికారులు అనాలోచిత, నిర్లక్ష్యం వల్లే తరచూ తమ గ్రామం పశువులను కోల్పోతున్నామని రైతులు సత్తి నాగేశ్వరావు, రాములు తదితరులు ఆరోపిస్తున్నారు.రేపల్లెవాడ దాని శివారు గ్రామం శ్రీరాంపురం గ్రామాలకు చెందిన రైతులు, పశువులు వ్యవసాయ భూములు, అడవికి రాకపోకలు సాగించే రహదారికి అడ్డుగా రైలు కట్ట నిర్మించారని, దాంతో నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎర్కోంటున్నామని తెలిపారు. గతంలోను పదుల సంఖ్యలో పశువులు మృత్యువాత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

# నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ

ఖమ్మంరూరల్, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని తరుణిహట్ ప్రాంగణంలోని ఎస్‌బీఐ ఆధ్వర్యంలోని స్వయం ఉపాది శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్ అకౌంటింగ్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫి, కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ సి.చంద్రశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన యువకులు ఈనెల 9లోపు తరుణిహట్‌లోని కేంద్రానికి వచ్చి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఉచిత శిక్షణతోపాటు ట్రైనింగ్ మెటీరియల్, టూల్‌కిట్స్, భోజన,వసతి సౌకర్యం కల్పిస్తామని, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ముగిసిన దేవీ నవరాత్రులు

**ఘనంగా అమ్మవారి విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం**
**ఖమ్మం మున్నేటి వద్ద సందడి**





ఖమ్మంలోని మున్నేరు వద్ద అమ్మవారి విగ్రహాల నిమజ్జనం దృశ్యం

ఖమ్మం ఖానాపురంహవేలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులు శనివారంతో ముగిశాయి. అమ్మవారి విగ్రహాలను ప్రతి ష్ఠించి, తొమ్మిది రోజులపాటు భక్తిప్రపత్తులతో పూజలు చేసిన భక్తులు.. సంబురంగా ఆ దుర్గమ్మను గంగమ్మ చెంతకు చేర్చారు. డప్పు చప్పుళ్ల మధ్య వాహనాలపై ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో ఘనస్వాగతం పలికారు. అనంతరం నిమజ్జనం చేశారు. ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసిన సుమారు 50 విగ్రహాలను ప్రకాష్ నగర్, కాల్వొడ్డు మున్నేరులో నిమజ్జనం చేశారు. ఇక నగరంలోని జమ్మిబండ వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారి మండపం వద్ద భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఈవో జగన్‌మోహన్‌రావు, భక్తబృందం సభ్యులు ప్రారంభించారు. సుమారు 2 వేల మందికి పైగా భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం అమ్మవారి శోభాయాత్ర ఘనంగా జరిగింది. నిమజ్జనం సందర్భంగా మున్నేరు వద్ద పోలీసులు, అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శోభాయాత్ర సమయంలో భారీ వర్షంపడగా.. భక్తులు వర్షంలో తడుస్తూనే అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. మహిళల కోలాటాలు, ఆట పాటలు, డీజే మోతలు, బ్యాండ్ మేళాల సందడితో శోభాయత్ర ఉత్సాహంగా జరిగింది.



# భక్తులతో పోటెత్తిన జమలాపురం ఆలయం



ఆలయంలో భక్తులతో నిండిన క్యూలైన్లు

ఎర్రుపాలెం, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంకు భక్తులు పోటెత్తడంతో శనివారం ఆలయం రద్దీగా మారింది. దసరా సెలవులు ముగుస్తుండడంతో ఆలయానికి రద్దీ పెరిగింది. ఆలయ అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని నూతన వాహనాలతో గిరి ప్రదక్షిణలు చేశారు. విజయదశమి పూజల అనంతరం నూతన వాహనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. శ్రీవారి ఆలయంతో పాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ సిబ్బంది ఉచితంగా అన్నవితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ ఇరుకులపాటి కృష్ణప్రసాద్, అర్చకులు రాజీవ్ శర్మ, మురళీమోహన్‌శర్మ, సేవాసమితి సభ్యులు ఎల్.వెంకటనారాయణరెడ్డి, సీహెచ్ శ్రీనివాసరావు, లీలాకృష్ణ, దేవాలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఈ అర్హతలు ఉండాలి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి) : త్వరలో నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచి పదవికి లేదా సభ్యునిగా లేదా పోటీ చేయాలంటే కింద పేర్కొన్న కొన్ని అర్హతలను తప్పనిసరిగా కలిగి వుండాలి. ఈ మేరకు ఎన్నికల సంఘం కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది.

- గ్రామ పంచాయతీ సభ్యునిగా సర్పంచ్ పదవికి పోటీ చేసే వ్యక్తి ఆ గ్రామ పంచాయతీ ఓటరు జాబితాలో పేరు నమోదయి ఉండాలి.
- వయసు 21 ఏళ్ల కంటే తక్కువగా ఉండకూడదు. నామినేషన్ల పరిశీలన తేదీ నాటికి ఈ వయస్సు లెక్కించబడుతుంది.
- షెడ్యూల్డు తెగలకు చెందిన అభ్యర్థుల ద్వారా భర్తీ చేయాల్సిన రిజర్వు పదవికి అభ్యర్థిగా ఉన్నట్లయితే, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి షెడ్యూల్డు తెగలుగా ప్రకటించిన ఏదేని కమ్యూనిటీకి చెందిన వారై ఉండాలి. షెడ్యూలు కులాలు లేదా వెనుకబడిన తరగతులకు రిజర్వు చేసిన పదవికి పోటీచేసే అభ్యర్థి తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి, షెడ్యూల్డు కులాలు లేదా వెనుకబడిన తరగతులుగా ప్రకటించిన ఏదైనా సామాజిక వర్గానికి చెందిన వారై ఉండాలి. మహిళలకు రిజర్వు చేసిన పదవికి పోటీ చేయడానికి స్థానిక మహిళయి ఉండాలి. అయితే, అదే కేటగిరిలో జనరల్ సీటుకు కూడా మహిళా అభ్యర్థిగా పోటీ చేయవచ్చు. రిజర్వుడు కేటగిరీ ఎస్సీఎస్టీ, బీసీకి చెందిన అభ్యర్థి రిజర్వుడు కాని పదవికి కూడా పోటీ చేయవచ్చు.

**అనర్హతలు ఇవీ..**

- నైతిక నేర ప్రవృత్తితో నేరానికి పాల్పడి క్రిమినల్ కోర్టు ద్వారా జైలుశిక్ష పడి ఉండకూడదు. శిక్ష ముగిసిన తేదీ నుంచి ఐదు ఏళ్ల కాలం వరకు పోటీకి అనర్హులు.
- 1955 పౌర హక్కుల పరిరక్షణ చట్ట ప్రకారము నేరానికి పాల్పడి శిక్ష అనుభవించి ఉండకూడదు.
- పోటీ చేసే వ్యక్తి మతిస్థిమితం కోల్పోయిన వారు అనర్హులు.
- దివాలా తీసిన, దివాలాతనం నుంచి బయటకు రాలేని వ్యక్తిగా న్యాయస్థానంలో పిటిషన్ వేసిన వారు అనర్హులు.
- గ్రామ పంచాయతీ, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా చేపట్టిన ప్రస్తుతం జరుగుతున్న పని కాంట్రాక్ట్ పొందివుండరాదు.
- గ్రామ పంచాయతీకి బకాయి పడి వుండి. ఆ బకాయి చెల్లించవలసినదిగా మీకు బిల్లు/నోటీసు ద్వారా తెలియజేయబడి, విధించిన గడువు ముగిసినప్పటికీ ఆ బకాయి చెల్లించకుండా ఉండకూడదు.
- గ్రామ సహాయకునిగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారి లేదా ఉద్యోగిగా, స్థానిక సంస్థలో గాని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందుతున్న వారై ఉండొద్దు.
- చట్టంలోని 21 (3) విభాగం ప్రకారము ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉండి మీరు అనర్హులుగా ప్రకటించబడి ఉండొద్దు.

## నామినేషన్ వేయాలంటే ఫీజు చెల్లించాల్సిందే..!

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, 2018 తెలంగాణ పంచాయతీ రాజ్ (ఎన్నికల నిర్వహణ) నియమావళి ప్రకారం రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు విధిగా ధరావత్ సొమ్మును చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా ప్రజాపరిషత్, మండల ప్రజాపరిషత్, గ్రామ పంచాయతీల పదవులకు ప్రత్యక్షంగా పోటీ చేయు అభ్యర్థులు చెల్లించవలసిన ధరావతు సొమ్ము వివరాలను ఖరారు చేసింది.

| పదవి పేరు | ఇతరులు(రూ.) | ఎస్సీ,ఎస్టీ, బీసీలకు (రూ.) |
|---|---|---|
| జడ్పీటీసీ | 5,000 | 2,500 |
| ఎంపీటీసీ | 2,500 | 1,250 |
| గ్రామపంచాయతీ | | |
| సర్పంచికి | 2000 | 1000 |
| వార్డు మెంబర్ | 500 | 250 |





## గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం



హర్షవర్ధన్ (ఫైల్)

ఏన్కూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజలింగాల గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు సాగర కాలవలో గల్లంతైన విద్యార్థి బొమ్మన బోయిన హర్షవర్ధన్(15) మృతదేహం శనివారం లభ్యమయింది. పోలీసులు ఈ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి దినేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సంధ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. హర్షవర్ధన్ సొంత గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

## రామయ్యకు స్వర్ణ తులసార్చన

**కల్యాణంలో పాల్గొన్న 92 మంది జంటలు**



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో శనివారంను పురస్కరించుకొని స్వామివారికి నిర్వహించిన నిత్య కల్యాణంలో 92మంది జంటలు పాల్గొన్నాయి. స్వామి వారికి నిత్యకల్యాణ ప్రక్రియలో విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణధారణ, జీలకర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేదాశీర్వచనం నిర్వహించారు. అలాగే శనివారం సంద ర్భంగా నిర్వహించిన స్వర్ణ తులసార్చన సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు భద్రాద్రికి తరలివచ్చారు.

# కొనసాగుతున్న కోటమైసమ్మ జాతర

**మూడో రోజూ భారీగా తరలివచ్చిన భక్తులు**



ఆలయం వద్ద వాహన పూజలు చేస్తున్న పూజారులు

కారేపల్లి అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లిలో కొనసాగుతున్న కోట మైసమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఇంత సంఖ్యలో జాతరకు భక్తులు తరలిరావడంతో పోలీసు సిబ్బంది ముందు జాగ్రత్త చర్యగా కిలో మీటరు దూరంగానే వాహనాలను అనుమతి ఇవ్వలేదు. దీంతో కాలిబటనే అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది అధక సంఖ్యలో భక్తులు రావాడంతో జాతర ప్రాంగణం సందడితో కిక్కిరిసి పోయింది. దీంతో స్టాల్స్ వద్దకు ప్రజలు భారీగా చేరుకుని వాటిపైకి ఎక్కి సందడి చేయడానికి అనేక ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం రాత్రి 12గంటలు దాటిన కూడా స్టాల్స్ వద్ద నుంచి జనం కదలకపోవడంతో స్టాల్స్‌కు ఉన్న లైట్లను బందుచేసిన జన సంచారం ఎక్కువగా ఉంది. ఒక సందర్బంలో పోలీసులు లాఠీచార్జీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జాతర మరో మూడు రోజుల పాటు జరగనున్న నేపథ్యంలో భారీగా జనం హాజరయ్యే అవకాశం ఉంది. అమ్మవారి ఆదాయం కూడా గణనీయంగా పెరుదుతుందని ఆశాభావం. కాగా జాతరలో ఏర్పాటుచేసిన షాపులవద్ద మహిళలు అనేక వస్తువులు కొనుగోల్ను చేస్తూ సందడిచేశారు.



దుకాణాల సముదాయం వద్ద వస్తువులు కొనుగోలు చేస్తున్న మహిళలు

## పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు శంకర్‌రావుకు ఎస్పీ అభినందనలు



అభినందిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

భద్రాచలం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు డివి శంకర్‌రావును జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అభినందించారు. ఇటీవల కేరళ రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భద్రాచలంకు చెందిన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు నాలుగు బంగారు పతకాలు సాధించారు. ఈ క్రమంలో ఈ రికార్డులను బెస్ట్ ఆఫ్ ఇండియా సంస్థ అధికారికంగా గుర్తించి వాటిని పోస్టు ద్వారా ఆయనకు పంపారు. ఈ క్రమంలో శనివారం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు చేతుల మీదుగా డీవీ శంకర్‌రావు చేతుల మీదుగా తీసుకోవడం జరిగింది. 73 ఏళ్ల వయస్సులో బైపాస్ సర్జరీ అయినా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనడం యువతకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ జీవీ రామిరెడ్డిని సైతం ఆయన అభినందించారు.

## రీజనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

ఇల్లెందు టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 2025-26గాను ఇల్లెందు ఏరియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రీజనల్ స్థాయి (మణుగూరు, ఇల్లెందు ఏరియా క్రీడా పోటీలను ఏరియా జీఎం వి.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దారుఢ్యం, మానసిక ఒత్తిడి పెంపొందించుకోవచ్చని, ఉద్యోగులు వారి విధులతో పాటు ప్రతిరోజు 30నిమిషాల పాటు వ్యాయామం చేయాలన్నారు. వ్యాయామం వల్ల ఆరోగ్యంగా ఉంటామని క్రీడల వల్ల క్రీడాకారులకు క్రమశిక్షణ ఏర్పాడుతుందన్నారు. ప్రతి సంవత్సరం సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా ఈ క్రీడలను నిర్వహిస్తుందని, యువ ఉద్యోగులు క్రీడలపై మక్కువ చూపి క్రీడల్లో రాణించాలని కోరారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని కబడ్డీ, బాల్ బాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పాఠశాలలో వంట పాత్రల అపహరణ

**పోలీసులకు ఫిర్యాదు**



వంట గదిని పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది

జూలూరుపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జూలూరుపాడులోని ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి వంట పాత్రలు అపహరించారు. ఈ సంఘటనపై శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనరసయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాలకు దసరా సెలవులు కావడంతో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి వంట గది తలుపునకు రంధ్రం పెట్టి లోపలకు చొరబడి వంట పాత్రలు ఎత్తుకు వెళ్లారు. సెలవుల అనంతరం పాఠశాల పునఃప్రారంభం రోజున కార్మికులు వంట చేసేందుకు పాత్రల కోసం గది వద్దకు వచ్చారు. తలుపునకు రంధ్రం ఉండడాన్ని గమనించి ప్రధానోపాధ్యాయుడికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన తోటి ఉపాధ్యాయులతో కలిసి వంట గదిని పరిశీలించారు. గదిలో లోపలికి వెళ్లి చూడగా కొన్ని వంట పాత్రలు కనిపించలేదు. రూ.15 వేలు విలువ చేసే వంట పాత్రలు చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ సంఘటపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## కొత్తగూడెంలో పైప్‌లైన్ పనిలో అపశ్రుతి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడెంలో పైప్‌లైన్ పనిలో అపశ్రుతి చోటు చేసుకుంది. శనివారం పోస్టాఫీస్ సెంటర్‌లోని సేయింట్ మేరీస్ పాఠశాల ప్రాంతంలో కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన మిషన్ భగీరథ పైప్‌లైన్ పని జరుగుతుండగా బీహార్ రాష్ట్రానికి చెందిన సంతోష్ అనే కార్మికుడు పనిలో నిమగ్నమయ్యాడు. గమనించని సదరు కార్మికులు పైపులైన్ కోసం తీసిన గుంతలను జేసీబీతో మట్టిని పోస్తూ పూడ్చి వేస్తున్నారు. ఈ సమయంలోనే తీసిన మట్టి సైతం గొయ్యిలోకి పడింది. తేరుకుని చూసేసరికి ఆ గుంతలో కార్మికుడు ఉన్నాడని గుర్తించి పూడ్చిన ఆ మట్టిని తీసివేశారు. ఈ సమాచారం తీసుకున్న వన్ టౌన్ సీఐ కరుణాకర్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని బయటకు తీసి చికిత్స నిమిత్తం కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి తరలించారు. కార్మికుడు సంతోష్ పరిస్థితి స్థిమితంగా ఉండగా, ఎటువంటి ఇబ్బంది లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



వెంకటరత్నం (ఫైల్)

ఎర్రుపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగళ్లపాడు గ్రామంలో గల వాగులో చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం నగ్గుర్తి వెంకటరత్నం(57) వ్యవసాయ కూలీగా జీవిస్తున్నాడు. వ్యవసాయ పనులు లేకపోవడంతో తన దగ్గర బంధువు నగ్గుర్తి భాస్కరరావుతో కలిసి గ్రామంలో గల కట్టలేరు నదికి సమీంలోని గల చిన్నేరు వాగులోకి చేపల వేటకు వెళ్లాడు. చేపలకు వలవేసే క్రమంలో వెంకటరత్నం బుడుగులోకి జారీ ఇరుక్కు పోయాడు. ఇది గమనించిన భాస్కరరావు ఈతరాని కారణంగా కేకలు వేస్తూ గ్రామంలోకి వెళ్లి గ్రామస్తులను పిలుసువచ్చాడు. వారు వచ్చి వాగులో గాలించగా అప్పటికే నీటిలో మునిగి మృతిచెందాడు. స్థానికులు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి వెంకటరత్నం కుటుంబసభ్యులకు అప్పగిం చారు. మృతుడికి భార్య, వివాహమైన ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

# ఏజెన్సీ హక్కులను కాలరాస్తున్న పాలకులు

**సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి జిల్లా కార్యదర్శి కొమరం**





సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కొత్తగూడెంటౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసుల హక్కులను కాలరాసే విధంగా పాలకులు కుట్రపన్నుతున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కొమరం సత్యనారాయణ ఆరోపించారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. శనివారం కొత్తగూడెం కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే విధంగా వ్యవహరిస్తుంటే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏజెన్సీ ప్రజలకు కల్పించిన అధికారాన్ని తొలగింపచేస్తుందన్నారు. పూర్తిగా ఏజెన్సీ ప్రాంతాలైన గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి, దుమ్ముగూడెం లాంటి జెడ్పీటీసీ స్థానాలను గిరిజనేతరులకు రిజర్వడ్ చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రకారం ఆదివాసీ ప్రాంతాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆదివాసులకే అన్ని స్థానాలను రిజర్వ్‌డ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కందగట్ల సురేందర్, ఉప్పరి బోయిన రామ్మూర్తి, మల్లూరి సుగుణ, సాంబ, గణేష్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటు.. ముగ్గురికి తీవ్ర గాయాలు

**గాయపడ్డ తల్లి, కుమారుడు, తోటి కోడలు**



గాయపడిన కొర్రా జాను, కొర్రా కవిత, బాలుడు సంతోష్‌కుమార్

జూలూరుపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గురై ముగ్గురికి తీవ్ర గాయలైన సంఘటన మండలంలోని ఎలకలొడ్డు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన కొర్రా రమేష్, నరేష్‌లు అన్నదమ్ములు. వీరికి ఎలకలొడ్డులోని అటవీ ప్రాంతం సమీపంలో భూమి ఉంది. దానిలో వారు పత్తి సాగుచేశారు. పొలంలో పనులను చేపట్టేందుకు కొర్రా రమేష్, అతని భార్య కొర్రా కవిత, 11ఏళ్ల కుమారుడు కొర్రా సంతోష్ కుమార్‌తో పాటు, తోటి కోడలు కొర్రా జాను(అలియాస్ ఝాన్సీ) నలుగురు వెళ్లారు. సాయంత్రం సమయంలో వర్షం రావటంతో తల్లి కవిత, కుమారుడు సంతోష్ కుమార్, తోటి కోడలు జానులు పొలంలో ఏర్పాటుచేసిన మంచె కిందకు వెళ్లారు. రమేష్ వారికి కొద్దిగా దూరంలో ఉన్నాడు. ఈ క్రమంలో మంచెపై పిడుగు పడి మంటలు వ్యాపించాయి. దీంతో షాక్‌కు గురై ముగ్గురు స్పృహ కోల్పోయారు. వారి దుస్తులు, శరీరం కాలిపోయింది. విషయాన్ని రమేష్ గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామస్తులు వారిని ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించేందుకు గాను తీసుకువచ్చేందుకు చేను వద్దకు ట్రాక్టర్ తీసుకుని వెళ్లారు. ఈ క్రమంలో వారికి వర్షం ఆటంకం కలిగించింది. అటవీ ప్రాంతంలోని గండిరేవు వాగు పొంగిపొర్లడంతో చేలో నుంచి గాయపడ్డ ముగ్గురిని తీసుకువచ్చేందుకు ఎలకలొడ్డు, రాంపురం గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్రంగా శ్రమించారు. మోకుల సహాయంతో ఈదుకుంటూ క్షతగాత్రులు ముగ్గురిని గ్రామస్తులు బయటకు తీసుకువచ్చి వైద్యచికిత్సలు అందించేందుకు కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కవిత, జానులకు కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో, సంతోష్‌కుమార్‌కు రామవరంలోని ఎంసీహెచ్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా కవితకు తీవ్ర గాయాలు అయ్యాయి.

# గుండెపోటుతో గ్రానైట్ యజమాని మైపాల్‌రెడ్డి మృతి



మైపాల్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న గ్రానైట్ యజమానులు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం ఖానాపురం పారిశ్రామిక ప్రాంతంలో గత 20 సంవత్సరాలకు పైగా గ్రానైట్ పరిశ్రమను స్థాపించి ఎందరికో ఉపాధి కల్పించిన వంశీ గ్రానైట్ పరిశ్రమ యజమాని మైపాల్ రెడ్డి(63) శుక్రవారం ఖమ్మం నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శుక్రవారం రాత్రి గుండెలో నొప్పితో ఖమ్మం నగరంలోని ఆయన నివాసంలో ఇబ్బంది పడుతుంగా కుటుంబ సభ్యులు ఆయనను ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామం జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ధర్మవరం గ్రామానికి తరలించారు. కుమారుడు అమెరికాలో ఉండటంతో అంత్యక్రిలు ఆదివారం ఆయన స్వగృహంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం ఖమ్మం టైల్స్ గ్రానైట్ అసోషియేషన్ నాయకులు ఆయన స్వగృహనికి చేరుకోని ఆయన మృతదేహాన్నికి నివాళ్లి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలిపారు. టైల్స్ అసోషియేషన్ అధ్యక్షుడు తెడ్డు రమేష్, నాయకులు బుగ్గవీటి శ్రీధర్, శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, వికాసరెడ్డి, వెంకటరెడ్డి తదిరులు మైపాల్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళ్లు అర్పించారు.



## ఐఎంఏ అధ్యక్షురాలిగా రెహనాబేగం



ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)జిల్లా అధ్యక్షులుగా ఖమ్మం నగరానికి చెందిన వైద్యురాలు రెహనాబేగం ఎన్నికయ్యారు. శనివారం నిర్వహించిన ఎన్నికల్లో ఆమె ఎన్నికయ్యారు. అధ్యక్షురాలుగా రెహనాబేగం, కార్యదర్శిగా డాక్టర్ ముక్కపాటి కోటేశ్వరరావు, కోశాధికారిగా డాక్టర్ కూరపాటి ప్రీతి, సభ్యులుగా డాక్టర్ కె.హరిప్రసాద్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు వైద్యులు అభినందించారు.

## రక్తదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి

- జిల్లావైద్యారోగ్యశాఖఅధికారి కళావతీబాయి
- రితన్య వలంటరీ బ్లడ్ సెంటర్ ప్రారంభం



రితన్య వలంటరీ బ్లడ్‌బ్యాంకును ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): రక్తదానం దాని ప్రాముఖ్యతపై ప్రజలకు విస్తృతగా అవగాహన కల్పించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతీబాయి అన్నారు. శనివారం నగరంలో రితన్య ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రితన్య వాలంటరీ బ్లడ్‌సెంటర్‌ను ఆమె ప్రారంభించారు.మిషనరీలు,పరికరాలను పరిశీలించారు.గతంలో ప్రమాదాల బారిన పడిన వారికి రక్తం అత్యవసరమైనదని, ఇప్పుడు వారితో పాటు తలసీమియా చిన్నారులకు రక్తం నిత్యం అందించాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, దాని ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. వలీవ్ క్రిప్టో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ జి.భారవి, జి.సుజాత, ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రెహాన బేగం, డాక్టర్ కోటేశ్వరరావు, గోంగూర వెంకటేశ్వరరావు తదితరులు పలు విభాగాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నారాయణమూర్తి, డాక్టర్ లక్ష్మీదీప, సంకల్ప సంస్థ సంయుక్త కార్యదర్శి కస్తూరి, ఉపాధ్యక్షురాలు పి.పావని, కోశాధికారి పి.రవిచందర్, పి.ఉదయ్‌భాస్కర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

## దామోదర్‌రెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

కామేపల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్‌రెడ్డి భౌతికకాయాన్ని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు, టీబీసీ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లమోతు లక్ష్మయ్య, ఏపూరి మహేందర్, జగన్నాథరెడ్డి తుంగతుర్తిలో సందర్శించి నివాళ్లు అర్పించారు. ఓ మంచి నాయకుడిని కోల్పోయామని కన్నీటిపర్యంతమయ్యారు. బానోత్ నర్సింహనాయక్, చల్లా మల్లయ్య, నాగేంద్రబాబు, ప్రసాద్, వివిధ పార్టీ నాయకులు పుచ్చకాయల బాబు, చిన్నవెంకటేశ్వర్లు, పుచ్చకాయల కోటయ్య, ఉదయ్‌కిరణ్, వీరనారాయణ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## ఘనంగా అమ్మవారి నిమజ్జనాలు

**ముగిసిన దేవీనవరాత్రులు**

నేలకొండపల్లి,అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలు, నవరాత్రులు ముగిసిన అనంతరం శనివారం నిమజ్జనానికి తరలి వెళ్లాయి. 9రోజుల పాటు అంగరంగ వైభవంగా భక్తులతో పూజలందుకున్న దుర్గామాత విగ్రహాలను సుందరంగా అలంకరించారు. ట్రాక్టర్లలో మేళతాళాల మధ్య నిమజ్జనానికి తరలించారు. విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రారంభమైన బతకమ్మలు ముగిసాయి. శనివారం నేలకొండపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో బ్రాహ్మణ మహిళలు సద్దుల బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

**ఘనంగా దుర్గామాత నిమజ్జన వేడుకలు**

తిరుమలాయపాలెం: దుర్గామాత నిమజ్జన వేడుకలను శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని కాకరవాయి,బచ్చోడు,సుబ్లేడు,పిండిప్రోలు, పాతర్లపాడు రఘునాధపాలెం తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. సుబ్లేడులో దుర్గాదేవికి జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓర వెంకటేశ్వర్లు, సుమన్‌రెడ్డి, రమేష్, పాల్గొన్నారు

**నిమజ్జన ఘాట్‌ను సందర్శించిన ఏడీసీపీ**

ఖమ్మంక్రైం: దుర్గాదేవి విగ్రహాల నిమజ్జన వేడుకల సందర్భంగా నగరంలోని కాల్వొడ్డు వద్ద నిమజ్జన ఘాట్‌ను ఏడీసీపీ ప్రసాదరావు నిమజ్జన ఏర్పాట్లు, బందోబస్తును శనివారం సందర్శించారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరిగేలా తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిమజ్జనం జరిగే ప్రాంతంలో పోలీసు పహారా పెంచి సమస్య తలెత్తకుండా కట్టుదట్టమైన చర్యలు చేపడతున్నట్లు ఏడీసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ఏసీపీ రమణమూర్తి, సీఐలు మోహన్‌బాబు, సత్యనారాయణ, పాల్గొన్నారు.

**అమ్మవారి విగ్రహాల నిమజ్జనానికి మునిసిపల్ ఏర్పాట్లు**

ఖమ్మంఅర్బన్:అమ్మవారి విగ్రహాల నిమజ్జనం కోసం కాల్వొడ్డు తోపాటు ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో మున్నేటి వద్ద ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ఆరుక్రేన్లు, బారీకేడింగ్, తాగునీరు, 250మంది మునిసిపల్ సిబ్బందిని నియమించినట్లు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. పోలీస్, ఫిషరీస్ డిపార్ట్‌మెంటుల సహకారంతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. వాహన రవాణా, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు చేశామన్నారు.



దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళుతున్న దృశ్యం



నేలకొండపల్లిలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నిమజ్జనానికి విగ్రహాలను తరలిస్తున్న దృశ్యం



సుబ్లేడులో దుర్గామాతకు పూజలు చేస్తున్న నరేష్‌రెడ్డి



నిమజ్జనఘాట్‌లను పరిశీలిస్తున్న ఏడీసీపీ ప్రసాదరావు

## పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేయాలి

**టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు**

కామేపల్లి, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతమైన కామేపల్లి, కారేపల్లి, ఏన్కూర్ మూడు మండలాలు కలుపుకొని సంయుక్తంగా గిరిజన పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేయాలని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు డిమాండ్ చేశారు. శనివారం తాళ్లగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం విఫలం చెందిదన్నారు. ఏజెన్సీ మండలాలకు దగ్గర్లో డోర్నకల్ జంక్షన్ కూడా ఉందని, కారిడార్ ఏర్పాటుకు అనువైనదన్నారు. మరో పక్క మూడు మండలాలకు వచ్చే సీతారామా ప్రాజెక్ట్ జూలురుపాడు టన్నెల్ పనులను కూడా పట్టించుకోవడంలేదన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో కూడా మంత్రుల నియోజకవర్గాల్లోనే ఏర్పాటు చేసి ఏజెన్సీ మండలాలకు మెండిచేయి చూపిస్తున్నారన్నారు. మధిరలో నియోజకవర్గంలో కాకుండా పారిశ్రామిక కారిడార్‌ను కామేపల్లి కారేపల్లి ఏన్కూర్ మండలాల్లో ఏర్పాటు చేయాలని టీడీపీ పార్టీ తరుపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పుచ్చకాయల సత్యనారాయణ, ఉపేందర్, ప్రభాకర్, పెరుగు రాము ఉన్నారు.

## స్థానిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**అదనపు కలెక్టర్ శ్రీజ**

నేలకొండపల్లి,అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ఈనెలలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించటానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ ఎంపీడీఓ మర్రి ఎర్రయ్యను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం ఆమె నేలకొండపల్లి ఎంపీడీఓ కార్యాలయాన్ని, మండల వనరుల కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల్లో నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాటు చేస్తున్న గదులను పరిశీలించారు. అనంతరం స్థానిక ఎన్నికల కోసం చేస్తున్న ఏర్పాట్ల గురించి ఎంపీడీఓ ఎర్రయ్యను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణకు చేసే ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని ఎంపీడీఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మర్రి ఎర్రయ్య, మండల విద్యాధికారి బాలిన చలపతిరావు పాల్గొన్నారు.



నేలకొండపల్లిలో మండల వనరుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీజ

తిరుమలాయపాలెం: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ పేర్కొన్నారు. శనివారం తిరుమలాయపాలెంలో మండలపరిషత్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఆర్వోస్, నామినేషన్ పత్రాలను పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సిలార్‌సాహెబ్, సూపరింటెండెంట్ శారదాదేవి, సీనియర్ అసిస్టెంట్ మీరా తదితరులు పాల్గొన్నారు.

## ఇజ్రాయెల్ చర్యలు అనాగరికం

ఖమ్మంఅర్బన్ అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ఇజ్రాయెల్ ప్రభుత్వం గ్లోబల్ సుముద్ ఫ్లోటిల్లా తీసుకువెళుతున్న సహాయ సామగ్రిని అడ్డుకోవటం అపహరించటం వంటి చర్యలను సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ తీవ్రంగా ఖండిస్తోందని మాస్‌లైన్ కేంద్రకమిటీ సహాయ కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో ఖండించారు. నెతన్యాహు ప్రభుత్వం సామ్రాజ్యావాది,ఫాసిస్ట్ అయిన ట్రంప్‌తో కలిసి గ్లోబల్ సుముద్ ఫ్లోటిల్లాను అపహరించటం బరితెగింపు చర్య అన్నారు. నిరుపేద పాలస్తీనా ప్రజలకు మానవతాసహాయాన్ని అందించేబాధ్యత రెడ్‌క్రాస్‌కు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎన్నికల విధుల్లో నిబంధనలు పాటించాలి

- నామినేషన్ల స్వీకరణకు మండలాల్లో పకడ్బందీ ఏర్పాట్లు
- మండల అధికారులతో అదనపు కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్




వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు నిర్వహించే విధంగా సన్నద్ధం కావాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి శనివారం సాయంత్రం స్థానిక సంస్థల ఎన్నికల కోసం నామినేషన్ స్వీకరణ, పోస్టల్ బ్యాలెట్, టీమ్ ల ఏర్పాటు, తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీలు, సంబంధిత అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీజ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ స్వీకరణకు మండల కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అవసరమైన కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు స్వీకరించాలన్నారు. మండల ప్రత్యేకఅధికారులు, తహసీల్దార్లు ఎన్నికల నిర్వహణలో ఎంపీడీఓలకు సహకరించాలన్నారు.ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన మేర అధికారులు నియామకం పూర్తిచేయాలని అన్నారు. మండలాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సంపూర్ణ సామగ్రి అందించినట్లు తెలిపారు. అక్టోబరు6న మొదటిదశ ర్యాండమైజేషన్ తర్వాత, విధులు కేటాయించనున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల వివరాలు, ఓటర్ జాబితా వివరాలు సంబంధిత పోటీ చేసే అభ్యర్థులకు సమాచారం అందించాలని అన్నారు. నామినేషన్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో ఎటువంటి ర్యాలీ, ప్రచారాలు అనుమతి లేవన్నారు. అభ్యర్థితో పాటు ముగ్గురికి మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసేందుకు అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే సీజ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, డీపీవో ఆశాలత, అదనపు డీఆర్డీవో జయశ్రీ, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వివాహిత మృతి

తిరుమలాయపాలెం, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. మండలంలోని సోలిపురం శివారు మంగ్యాతండాకు చెందిన యర్రనాగుల మంజుల(25) గత నెల17న భర్తతో గొడవపడి పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికిపాల్పడింది. పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## 10వరకు అంబేద్కర్ ఓపెన్ ప్రవేశాలు

సత్తుపల్లిరూరల్,అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలు పొందుటకు ఈనెల 10 వరకు అవకాశం ఉందని స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ చీపు పూర్ణచంద్రరావు తెలిపారు. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ స్టడీసెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 120 గ్రాముల గంజాయి స్వాధీనం

తిరుమలాయపాలెం,అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తెట్టెల్లపాడు క్రాస్ రోడ్డు వద్ద ఎక్సైజ్ పోలీసులు శనివారం 120 గ్రాముల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రవాణా చేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో వాహన తనిఖీ చేస్తుండగా మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన గుంజా మహేష్,షేక్.యాకూబ్‌పాషా, మేడిదపల్లికి చెందిన రాకేష్,మహబూబాబాద్ జిల్లా చిలక్కోయలపాడుకు చెందిన రుద్రాక్షి మహేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రమోహన్ చెప్పారు. దర్యాప్తు చేపట్టామన్నారు.

## సాయిబాబాకు వాస్తు పూజ



పూజలు చేస్తున్న అర్చకులు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): కవిరాజ్‌నగర్ 15వ రోడ్డులో ఉన్న సాయిబాబా మందిరంలో చైర్‌పర్సన్ కీసర పద్మజారెడ్డి, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం వాస్తుపూజ నిర్వహించారు.ఈ పూజల్లో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. సాయిబాబా, గణపతి, సుబ్రహ్మనేశ్వర స్వామి పునః ప్రతిష్ఠ, కనకదుర్గ, ఆంజనేయ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. అర్చకులు నంచర్ల సత్యనారాయణ, కోటూరు పాండురంగారావు పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు గణపతి పూజ, కర్ణహ పుణ్యాహవచనం, మండపారాధన పూజలు, మూలమంత్ర హోమాలు నిర్వహించనున్నారు.

## ఒకే ఒక్కడు



ఏన్కూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం శ్రీరాంగిరి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో కేవలం ఒకే ఒక్క విద్యార్థి చదవుతున్నాడు. 5వతరగతి చదవుతున్న బాణాల మహేష్ ఒక్కడే ఉండడం విశేషం. ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన పాఠశాల నేడు విద్యార్థులు లేక కళాహీనమైంది. విద్యార్థుల తల్లిదండ్రులు సంక్షేమ గురుకులాల వైపు మొగ్గుచూపడం వల్ల రానురాను విద్యార్థుల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. 2024 అక్టోబరులో సాదఖున్ ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలు బదిలీపై వచ్చింది. ఆ సమయంలో ముగ్గురు విద్యార్థులండగా ఈ ఏడాది జూన్‌లో ఒకరు, జులైలో మరోకరు గురుకులాలకు వెళ్లడంతో ప్రస్తుతం ఒక్క విద్యార్థి మాత్రమే మిగిలాడు. ఈఒక్క విద్యార్థి కోసం ఉపాధ్యాయురాలు, ఆయా పనిచేస్తున్నారు

**విద్యార్థుల పెంపుపై దృష్టి, ఎంఈవో వాసవీదేవి**

విద్యార్థుల పెంపునకు ప్రత్యేక దృష్టి పెట్టాం. పాఠశల బలోపేతానికి ప్రత్యేక కృషి అర్హత కలిగిన టీచర్లు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలి.

## పాఠశాలకు జిరాక్స్ మిషన్ వితరణ

తల్లాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మగూడెం ప్రాథమిక పాఠశాలకు లయన్సు క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జిరాక్స్ మిషన్‌ను వితరణగా అందించారు. లయన్సుక్లబ్ సభ్యుడు దొబ్బల శ్రీనివాసరావు కుమారుడు అరవింద్ జన్మదినం సందర్భంగా పాఠశాలకు జిరాక్స్ మిషన్ అందించారు. ఈకార్యక్రమంలో లయన్సుక్లబ్ అధ్యక్షుడు కోడూరు నాగేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి దారా శ్రీనివాసరావు, కార్యదర్శి నంబూరి కనుకదుర్గప్రసాద్, శీలం వెంకటరెడ్డి, కటికి వెంకటేశ్వరరావు, మారెళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

వైరా, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పలమడకలో ఉన్న శ్రీసోమలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను వైరా ఎస్ఐ పుష్పాల రామారావు శనివారం ప్రారంభించారు. ఈ ఆలయంలో తరచూ దొంగలు హుండీ పగులగొట్టి చోరీకి పాల్పడుతుండడంతో ఎస్ఐ రామారావు సూచనల మేరకు ఆలయ కమిటీ సీసీ కెమెరాలను ఏర్పాటుచేసింది. ఆలయ ఈవో ప్రసాద్, ఆలయ నిర్వాహకుడు వీరపనేని చెన్నకేశవరావు ఆధ్వర్యంలో కెమెరాలను అమర్చారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో హుండీ దొంగతనాలను అరికట్టవచ్చునని ఆలయ అధికారులు, కమిటీ చూపిన చొరవను ఎస్ఐ అభినందించారు. ట్రెయినీ ఎస్ఐ వెంపటి పవన్, ఆలయ ఈవో, జూనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, వైరా న్యూలిటిల్‌ఫ్లవర్ కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, ఆలయ నిర్వాహకులు చెన్నకేశవరావు, గోసు కృష్ణయ్య, యడ్లపల్లి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్‌పాపయ్య, మాజీ ఎంపీటీసీ ఆకుల ప్రసాద్, మేడా శ్రీనివాసరావు, మేడా సూర్యనారాయణ పాల్గొన్నారు.

## గురుకులంలో సోలార్ ఫెన్సింగ్ పనులు ప్రారంభం

**రూ.2 లక్షలు పేరెంట్స్ వితరణ**

కల్లూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలిక విద్యాలయంలో శనివారం తహసిల్దార్ పి.సాంబశివుడు సోలార్ ఫెన్సింగ్ పనులను ప్రారంభించారు. ఈవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులు తమ వంతుగా ముందుకు వచ్చి అందజేసిన రూ.2 లక్షల విరాళాలతో ఈ పనులను ప్రారంభించారు. ఈ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినులు కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. వాటి నుంచి రక్షణకై సోలార్ ఫెన్సింగ్ అవసరమని, దాంతో ఈ సమస్య పరిష్కారం అవుతుందని ఈ విద్యాలయంలో విద్యార్థినుల తల్లిదండ్రులు నిర్ణయించారు. ఈ సమస్యను పలుమార్లు తల్లిదండ్రులు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఇక ఫలితం లేదని బావించిన తల్లిదండ్రులు తమ పిల్లల రక్షణ కోసం వితరణ రూపంలో ముందుకు వచ్చారు. ప్రజా ప్రతినిధుల ఆదేశాలతో అధికారుల అనుమతితోపై విధంగా ఈవిద్యాలయంలో వసతిగృహం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు పేరెంట్స్ శ్రీకారం చుట్టారు. వసతిగృహం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయటానికి ముందుకు వచ్చిన పేరెంట్స్‌ను తహసిల్దార్ సాంబశివుడు అభినందించారు.గురకుల విద్యాలయ ప్రిన్సిపాల్ కనకదుర్గ, పేరెంట్స్ కమిటీ కార్యదర్శి పరిగడుపు బాబురావు, జంగం జయరాజు, మర్సకట్ల కిషోర్, మేరకు శ్రీనువాసరావు, జయదప్ ప్రకాష్, కిరణ్ పాల్గొన్నారు.

## ముత్యాలమ్మతల్లి ఆలయానికి విరాళం

పెనుబల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లిలోని శ్రీ ముత్యాలమ్మతల్లి ఆలయానికి బొర్రా నాగేశ్వరరావు, వెంకటలక్ష్మీ వీరి అల్లుడు, కుమార్తె ఇరువూరి రాఘవేంద్ర, సాయి నవ్యశ్రీ దంపతులు ఆలయానికి భోజనం టేబుళ్ల నిమిత్తం రూ.25116 విరాళాన్ని అందజేశారు. దాతలను ఆలయ కమిటీ నిర్వాహకులు అభినందించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

## నేడు ఖమ్మంలో పామాయిల్ రైతుల సదస్సు

వైరా, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఖమ్మం స్వర్ణభారతి కల్యాణమండపంలో ఆదివారం ఉదయం పదిగంటలకు జరిగే పామాయిల్ రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రైతుసంఘం రాష్ట్ర నాయకులు కె.పుల్లయ్య,బొంతు రాంబాబు, చెలకాని వెంకట్రావ్ పిలుపునిచ్చారు. శనివారం వైరాలో జరిగిన రైతుసంఘ సమావేశంలో వారు మాట్లాడారు. పామాయిల్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర స్థాయి సదస్సులో చర్చించి పరిష్కారం కోసం ఐక్య రైతు ఉద్యమమే మార్గంగా ముందుకు సాగేందుకు జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. చింతనిప్పు చలపతిరావు పాల్గొన్నారు.

## విద్యార్థినికి సన్మానం

మధిర,అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మధిరలోని నారాయణ బెస్ట్‌ఫౌండేషన్ స్కూల్‌లో 10వ తరగతి చదివి ఇటీవల విడుదల అయిన నీట్ ప్రవేశ పరిక్షలో మంచి ర్యాంక్‌తో మెడికల్ సీటు సాధించిన విద్యార్థినిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు సన్మానించారు. శనివారం పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది.

# ఆరోగ్యవంతమైన సమాజం యోగాతో

ఏన్కూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతితో మమేకమై ఆరోగ్యవంతమైన సమాజం కోసం చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ సినీ గేయరచయిత ప్రకృతి కవి జీ.జయరాజ్ కొనియాడారు. శనివారం మండలంలోని నాచారంలో ఎస్ఎస్‌వై ప్రకృతి యోగా ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అద్భుత వెంకటేశ్వరస్వామి సన్నిధిలో కొండలు, గుట్టలతో ప్రకృతి పరవశించే ప్రదేశంలో యోగా ఆశ్రమాన్ని నెలకొల్పడం అద్భుతమన్నారు. ఈసందర్భంగా జయరాజ్ దంపతులను ఘనంగా సన్మానించారు ఈకార్యక్రమంలో యోగాచార్యులు ప్రేమ్ నిరంతర్ మల్లేష్ గురూజీ, ఎంఈవో ఎస్.దామోదరప్రసాద్, ఎస్ఎస్‌వై నిర్వాహకులు దారా విష్ణుమోహనరావు, దుగ్గిదేవర అజయ్‌కుమార్, కోటగిరి ప్రవీన్ పాల్గొన్నారు.

# ఎవరు ఏ పార్టీలో?

- ప్రత్యర్థి పార్టీతో అంటకాగుతున్న నాయకులు
- ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ద్వితీయ శ్రేణి నాయకులు
- జిల్లా మంత్రులకు ఫిర్యాదు చేసిన అధికార పార్టీ నాయకులు

సత్తుపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గంలో విచిత్రమైన రాజకీయ పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. కొంతకాలంగా ప్రధాన పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు ప్రత్యర్థి పార్టీల నాయకులతో సత్సంబంధాలు కొనసాగించడం. కొందరు ఆయా పార్టీ నాయకులతో అంటకాగడం ద్వితీయ శ్రేణి నాయకులకు నచ్చడం లేదు. ఈ పరిణామాలు అధికార, విపక్ష బీఆర్ఎస్ పార్టీలో కిందిస్థాయి కేడర్‌లో తీవ్ర అసంతృప్తికి గురిచేస్తున్నాయి. 2009నుంచి సత్తుపల్లి నియోజకవర్గంలో వరుసగా మూడు పర్యాయాలు టీడీపీ విజయం సాధించగా 2018తర్వాత టీడీపీ నుంచి గెలుపొందిన వెంకటవీరయ్య బీఆర్ఎస్‌లో చేరడంతో టీడీపీ కేడర్ చాలావరకు బీఆర్ఎస్‌లో చేరింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లోని అనేకమంది నాయకులు కాంగ్రెస్‌లో చేరి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మట్టా రాగమయి విజయానికి కృషి చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన వారిని అధికార పార్టీలోకి రానివ్వబోమని, ఎవరైనా కాంగ్రెస్‌లోకి రావాలంటే స్థానిక నాయకత్వం ఆమోదం ఉండాలని కాంగ్రెస్ నాయకత్వం ప్రకటించింది. ఈ క్రమంలో కొందరు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. మరికొందరు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రకటించినా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకత్వంలో మాత్రం వారు చేరలేదు. అయినా కాంగ్రెస్ నాయకులుగా చలామణి అవుతున్నారు.





సత్తుపల్లి పొలిటికల్ మ్యాప్

## అధికార పార్టీ నాయకుల తీరుతో శ్రేణుల అసంతృప్తి

దీంతోపాటు అధికార పార్టీ నాయకులతో కొందరు విపక్ష బీఆర్ఎస్ నాయకులు సంబంధాలు కొనసాగించడం అధికార పార్టీలో ద్వితీయ శ్రేణి కార్యకర్తలను అసంతృప్తికి గురిచేసింది. మరో వైపు అధికార పార్టీ నాయకులు కూడా కొందరు వారి వ్యక్తిగత అవసరాలు, భవిష్యత్ రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌లోని ఒకరిద్దరు నాయకులతో సంబంధాలు కొనసాగించడం కూడా ఇరుపార్టీల్లో చర్చనీయాంశంగా మారింది. స్థానిక ఎమ్మెల్యేతోగానీ, ఎమ్మెల్యే అనుచరులతో గానీ సంబంధాలు లేకుండా తాము కాంగ్రెస్ అంటూ ప్రకటించుకుంటూనే బీఆర్ఎస్ నాయకులతో సందర్భానుసారం కలిసి తిరగడం, వారి పనులు చక్కబెట్టుకోవడాన్ని కాంగ్రెస్ కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. దీనిపై జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులకు కొందరు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ అని చెప్పుకుంటూ బీఆర్ఎస్ నాయకులతో సంబంధాలు కొనసాగిస్తూ స్థానిక నాయకత్వాన్ని ఇబ్బందులకు గురిచేసే పనులు చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ కేడర్ పోస్టింగులు పెడుతోంది. అధికార పార్టీలో నాయకులు నాలుగు గోడల మధ్య చర్చించిన అంశాలు కూడా క్షణాల్లో ప్రత్యర్థి నాయకులకు, కార్యకర్తలకు సమాచారం వెళ్లడంపై తమలో కూడా కోవర్టులున్నారని అధికార పార్టీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## సొంత పనుల కోసం బీఆర్ఎస్ నాయకులు..

కొందరు బీఆర్ఎస్ నాయకులు తమ సొంత పనులు చక్కబెట్టుకోవడం కోసం అధికార పార్టీ నాయకులతో కలిసిమెలిసి తిరుగుతుండడం ఇటు అధికార పార్టీలోనూ.. అటు బీఆర్ఎస్‌లోని కింది స్థాయి నాయకుల్లోనూ అసంతృప్తికి కారణమవుతోంది. రాజకీయ విలువలు, కట్టుబాట్లకు తిలోదకాలిచ్చి కొందరు నాయకులు ప్రత్యర్థి పార్టీ నాయకులతో అంటకాగడంపై ఇరుపార్టీల్లోనూ ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. అలాంటి నాయకులను గుర్తించి వారిని కట్టడి చేయాలని ఆయా పార్టీల కేడర్ తమ నాయకత్వాలను కోరుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల వేళ వ్యక్తిగత స్వార్థంతో పార్టీని స్వప్రయోజనాలకు వాడుకునే నాయకుల వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని, వీరిపట్ల నాయకత్వం అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల జరిగిన పలు సంఘటనలను ఉటంకిస్తూ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌కు కొందరు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మరో వైపు బీఆర్ఎస్ కిందిస్థాయి కేడర్ కూడా స్వార్థం కోసం పనిచేసే నాయకులను దూరం పెట్టాలని ఆపార్టీ నాయకత్వాన్ని ఇటీవల కోరినట్లు తెలిసింది. మొత్తంగా సత్తుపల్లి నియోజకవర్గంలో కొంతకాలంగా జరుగుతున్న ఈ విచిత్ర రాజకీయ పరిణామాలు కొత్త చర్చకు తెరలేపుతున్నాయి.

## ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ శ్రీజ

ముదిగొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మండల అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్లకు సంబంధించి సామగ్రిని, అన్ని సౌకర్యాలను సిద్ధం చేసుకోవాలన్నారు. మండలంలో ఎన్ని పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. సంబంధిత అధికారులు ఎవరని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు సంబంధించిన సామగ్రిని ఆమె పరిశీలించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేష్, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, యూడీసీ భాస్కర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## మెడికల్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం

మధిర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మధిరలోని నారాయణ బెస్ట్ ఫౌండేషన్ స్కూల్‌లో 10వ తరగతి చదివి ఇటీవల విడుదల అయిన నీట్ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంక్‌తో మెడికల్ సీటు సాధించిన విద్యార్థినిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు సన్మానించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ బోనగిరి నారాయణరావు, డైరక్టర్ వనజతోపాటు ఉపాధ్యాయులు హైదరాబాద్ ఆయాన్ మెడికల్ కళాశాలలో ఫ్రీ సీటు సాధించిన విద్యార్థిని ఎస్.కె. సలీనాతోపాటు తాడేపల్లిగూడెం ఎన్ఐటిలో సీటు సాధించిన విద్యార్థిని కేతేపల్లి దర్శినిలను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు.

## రేపు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

సత్తుపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సోమవారం సత్తుపల్లిలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆపార్టీ మండల పార్టీ అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 1గంటకు స్థానిక సిద్దారం రోడ్డులోని శ్రీ లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరవ్వనున్నారని, సత్తుపల్లి మండలం, రూరల్ కార్యకర్తలు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## నేడు ఖమ్మంలో పామాయిల్ రైతుల సదస్సు

వైరా, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం స్వర్ణభారతి కల్యాణమండపంలో ఆదివారం ఉదయం పదిగంటలకు జరిగే పామాయిల్ రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రైతుసంఘం రాష్ట్ర నాయకులు కె.పుల్లయ్య, బొంతు రాంబాబు, చెలకాని వెంకట్రావ్ పిలుపునిచ్చారు. శనివారం వైరాలో జరిగిన రైతుసంఘ సమావేశంలో వారు మాట్లాడారు. పామాయిల్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్రస్థాయి సదస్సులో చర్చించి పరిష్కారం కోసం ఐక్య రైతు ఉద్యమమే మార్గంగా ముందుకు సాగేందుకు జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. చింతనిప్పు చలపతిరావుపాల్గొన్నారు.

## 10వరకు అంబేద్కర్ ఓపెన్ ప్రవేశాలు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలు పొందుటకు ఈనెల 10వ తేదీ వరకు అవకాశం ఉందని స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ చీపు పూర్ణచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ స్టడీ సెంటర్‌లో ఈ విద్యా సంవత్సరానికిగానూ బీఏ, బీకాం, బీఎస్సీలో ప్రవేశాల నిమిత్తం ఆసక్తిగల ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్ పాసైన విద్యార్థులు అర్హులని, వివరాలకు 9491881910, 8187837058 సంప్రదించాలని ఆయన కోరారు.

## పాఠశాలకు జిరాక్స్ మిషన్ వితరణ

తల్లాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మగూడెం ప్రాథమిక పాఠశాలకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జిరాక్స్ మిషన్‌ను వితరణగా అందించారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు దొబ్బల శ్రీనివాసరావు కుమారుడు అరవింద్ జన్మదినం సందర్భంగా పాఠశాలకు జిరాక్స్ మిషన్ అందించారు. ఈకార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కోడూరు నాగేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి దారా శ్రీనివాసరావు, కార్యదర్శి నంబూరి కనుకదుర్గప్రసాద్, శీలం వెంకటరెడ్డి, కటికి వెంకటేశ్వరరావు, మారెళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## సవాళ్లను అధిగమిస్తేనే ఫలితాలు

సత్తుపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని గ్రూప్-1 అధికారిగా ఎంపికైన ప్రమోద్‌కుమార్ నిరూపించారని సృజన సాహితీ సమాఖ్య బాధ్యులు అన్నారు. ఇటీవల మెడికల్ అండ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఎంపికైన సందర్భంగా శనివారం సత్తుపల్లిలో ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించారు. జీవితంలో ఎదురయ్యే పరీక్షలను తట్టుకుని నిలబడగలిగినప్పుడే మనం అనుకున్న లక్ష్యాలను ఛేదించగలమని ప్రమోద్ అన్నారు. కార్యక్రమంలో గట్టి వాసు, జీ.రామకృష్ణ, మధుసూదనరాజు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, అవినాష్, సంతోష్, రామిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సీపీఎం సన్నద్ధం

కారేపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలతోపాటు 41 గ్రామపంచాయతీలు, 16ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థులను నిలబెట్టేందుకు సీపీఎం పార్టీ సన్నద్ధం అవుతోందని వైరా డివిజన్ సీపీఎం కార్యదర్శి భూక్య వీరభద్రం అన్నారు. శనివారం మండల కమిటీ సమావేశం ముండ్ల ఏకాంబరం అధ్యక్షతన జరిగింది. స్థానిక ఎన్నికలు సజావుగా సాగే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.నరేందర్,డివిజన్ కమిటి సభ్యులు వజ్జా రామారావు తదితరులు పాల్గొన్నారు.

## 'స్థానికం'లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మధిర రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీ జడ్పీచైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజ్ పిలుపునిచ్చారు. శనివారం మధిర బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలకు బీఆర్ఎస్ నాయకత్వం సంసిద్ధంగా ఉండాలని, అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల నిర్వహణకు గ్రామస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

# అన్ని చోట్లా గెలుపే లక్ష్యం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యమని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ స్పష్టం చేశారు. శనివారం వైరాలోని తమ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదుమండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమీక్షించారు. మండలాలవారీగా ఈ ఎన్నికలను ఎదుర్కోవాల్సిన తీరుతెన్నులపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను బరిలోకి దించాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక మొదలు ఎన్నికల నిర్వహణ, పోలింగ్ ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు. ఒక్కో జడ్పీటీసీకి ముగ్గురు ఆశావాహుల పేర్లను ప్రతిపాదించాలని సూచించారు. మండలాలవారీగా ముగ్గురు చొప్పున అభ్యర్థుల పేర్లను టీపీసీసీకి పంపిస్తామని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, ఐదుమండలాల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, స్వర్ణ నరేంద్ర, మంగీలాల్, తలారి చంద్రప్రకాష్, వైరా పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, నాయకులు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వరరావు, సూరంపల్లి రామారావు, దొడ్డా పుల్లయ్య, దానియేలు, ధార్న రాజశేఖర్ పాల్గొన్నారు.

## ముత్యాలమ్మతల్లి ఆలయానికి విరాళం



పూజలు చేస్తున్న దృశ్యం

పెనుబల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లిలోని శ్రీ ముత్యాలమ్మతల్లి ఆలయానికి బొర్రా నాగేశ్వరరావు, వెంకటలక్ష్మీ వీరి అల్లుడు, కుమార్తె ఇరుపూరి రాఘవేంద్ర, సాయి నవ్యశ్రీ దంపతులు ఆలయానికి భోజనం టేబుళ్ల నిమిత్తం రూ25116 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ నిర్వాహకులు అభినందించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

## ఉదయం దట్టమైన పొగమంచు.. మధ్యాహ్నం నుంచి వర్షపు జల్లులు

వైరా, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వైరాలో శనివారం వాతావరణంలో అనేక మార్పులు జరిగాయి. ఉదయం చల్లటి గాలితో రోడ్లు, పొలాల్లో దట్టమైన పొగమంచు అలుముకుంది. ఎదురెదురుగా మనుషులు కూడా కన్పించని రీతిలో మంచు కురిసింది. ఆతర్వాత మధ్యాహ్నం రెండుగంటల వరకు వేసవికాలాన్ని మరిపిస్తూ ఉక్కపోతతో విపరీతమైన ఎండ కాసింది. అనంతరం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో ఆకాశం మేఘావృతమై వర్షపు జల్లులు కురిశాయి. కేవలం రెండురోజులు మాత్రమే వర్షాలు తెరిపిచ్చి మళ్లీ తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులతో వర్షం కురిసింది.



ఉదయం వరిపొలాల్లో అలుముకున్న పొగమంచు



మధ్యాహ్నం వేళ ఆకాశం మేఘావృతమైన దృశ్యం

# ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎస్ఐ

వైరా, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పలమడకలో ఉన్న శ్రీసోమలింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను వైరా ఎస్ఐ పుష్పాల రామారావు శనివారం ప్రారంభించారు. ఈ ఆలయంలో తరచూ దొంగలు హుండీ పగులగొట్టి చోరీకి పాల్పడుతుండడంతో ఎస్ఐ రామారావు సూచనల మేరకు ఆలయ కమిటీ సీసీ కెమెరాలను ఏర్పాటుచేసింది. ఆలయ ఈవో ప్రసాద్, ఆలయ నిర్వాహకుడు వీరపనేని చెన్నకేశవరావు ఆధ్వర్యంలో ఈ సీసీ కెమెరాలను అమర్చారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో హుండీ దొంగతనాలను అరికట్టవచ్చునని ఆలయ అధికారులు, కమిటీ చూపిన చొరవను ఎస్ఐ అభినందించారు. ట్రెయినీ ఎస్ఐ వెంపటి పవన్, ఆలయ ఈవో, జూనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, వైరా న్యూలిటిల్‌ఫ్లవర్ కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, ఆలయ నిర్వాహకులు చెన్నకేశవరావు, గోసు కృష్ణయ్య, యడ్లపల్లి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్‌పాపయ్య, మాజీ ఎంపీటీసీ ఆకుల ప్రసాద్, మేడా శ్రీనివాసరావు, మేడా సూర్యనారాయణ, గరిడేపల్లి సత్యనారాయణ, అర్చకుడు పాల్గొన్నారు.

## గురుకులంలో సోలార్ ఫెన్సింగ్ పనులు ప్రారంభం

- రూ.2 లక్షలు పేరెంట్స్ వితరణ

కల్లూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలిక విద్యాలయంలో శనివారం తహసిల్దార్ పి.సాంబశివుడు సోలార్ ఫెన్సింగ్ పనులను ప్రారంభించారు. ఈ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులు తమ వంతుగా ముందుకు వచ్చి అందజేసిన రూ2 లక్షల విరాళాలతో ఈ పనులను ప్రారంభించారు. ఈ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినులు కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. వాటి నుంచి రక్షణకై సోలార్ ఫెన్సింగ్ అవసరమని, దాంతో ఈ సమస్య పరిష్కారం అవుతుందని ఈ విద్యాలయంలో విద్యార్థినుల తల్లిదండ్రులు నిర్ణయించారు. ఈ సమస్యను పలుమార్లు తల్లిదండ్రులు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఇక ఫలితం లేదని బావించిన తల్లిదండ్రులు తమ పిల్లల రక్షణ కోసం వితరణ రూపంలో ముందుకు వచ్చారు. ప్రజా ప్రతినిధుల ఆదేశాలతో అధికారుల అనుమతితోపై విధంగా ఈ విద్యాలయంలో వసతిగృహం చుట్టూత సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు పేరెంట్స్ శ్రీకారం చుట్టారు. ఇలా విద్యాలయ వసతి గృహం చుట్టూత ఫెన్సింగ్ ఏర్పాటు చేయటానికి ముందుకు వచ్చిన పేరెంట్స్‌ను తహసిల్దార్ సాంబశివుడు అభినందించారు. గురకుల విద్యాలయ ప్రిన్సిపాల్ కనకదుర్గ, పేరెంట్స్ కమిటీ కార్యదర్శి పరిగడుపు బాబురావు, జంగం జయరాజు, మర్సకట్ల కిషోర్, మేరకు శ్రీనువాసరావు, జయదప్ ప్రకాష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

మధిర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. శనివారం మధిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక శాసన సభ్యులు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వేల కోట్లు నిధులు తెచ్చి మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని ఆయన చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించేలా పని చేయాలని అన్నారు. స్థానికంగా మంచి అభ్యర్థులను పోటీలో నిలపాలని ఎంపిటీసి, జడ్పీటీసితోపాటు అన్ని సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా వ్యూహం రచించాలని అందరూ సమన్వయంతో కలిసి కట్టుగా పని చేయాలని అన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయిలూరి సత్యనారాయణ రెడ్డి నాయకులు నిడమానూరు వంశీ, దుంపా వెంకటేశ్వరరెడ్డి, పులిబండ్ల చిట్టిబాబు, రవికుమార్ పాల్గొన్నారు.

# సింగరేణిలో స్థానికత కోసం పోరాటం

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు



రేజర్లలోని సుశీ కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న బీసీ సంఘ నాయకులు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రభావిత ప్రాంతాలను కాదని జార్ఖండ్, బీహార్ వంటి ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని ఓబీ పనులకు కేటాయించారని, ఇకపై స్థానికులను చేర్చకుంటే పోరాటం తప్పదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం మండలంలోని రేజర్లలోని సుశీ ప్రైవేట్ కంపెనీలో స్థానికులకే ఉద్యోగాలివ్వాలంటూ ఆందోళన చేపట్టారు. భూములు కోల్పోయిన వారికి, స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనని, వచ్చే వారంలోగా ఇతర ప్రాంతాలకు చెందిన వారిని తక్షణమే పంపించి వేయాలని డిమాండ్ చేశారు. కాదని పనిలో ఉంచుకుంటే ఎన్నికల కోడ్ అనంతరం సుశీ క్యాంప్ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తామని హెచ్చరించారు. దుస్సా వెంకటేశ్వర్లు, ఖలీల్, షరీఫ్, కరుణతేజ, అలవాల కరుణాకర్, సాయి శ్రీనివాస్, తెలగారపు అప్పారావు, ఫక్రుద్దీన్, కొండలు, బలుసుపాటి అప్పారావు, నారాయణవరపు రామకృష్ణ, నాంచారయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ముగిసిన దేవీనవరాత్రులు

నవరాత్రులలో పూజలందుకున్న అమ్మవారి దేవీనవరాత్రులు శనివారంతో ఘనంగా ముగిశాయి. గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి 9రోజులపాటు భక్తులు పూజలు చేసి చివరిరోజు విగ్రహాలను డప్పువాయిద్యాల మధ్య గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు.



వైరాలో విగ్రహాల ఊరేగింపులో ఎమ్మెల్యే



సత్తుపల్లిలో..



తల్లాడలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు



ముదిగొండలో కొలాటం చేస్తున్న దృశ్యం

## పలు చోట్ల భక్తులకు అన్నదానం



అన్నప్రసాదంలో ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు చందర్‌రావు

కల్లూరు, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రి మండప కమిటీ తరుపున శనివారం ఏర్పాటు చేసిన మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు ప్రారంభించారు. ఆర్యవైశ్య ప్రముఖులు కిరణ్, చలువాది నగేష్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు శ్రీను, పసుమర్తి రామకృష్ణరావు, దోసపాటి కృష్ణార్జునరావు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని ద్వారకాపూరి కాలనీలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. పట్టణానికి చెందిన కూకలకుంట వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు దవనమ్మ, అడ్వకేట్ రవి, సుకన్య, అరుణ్‌సాహీలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీ గీతాజ్ఞానమందిరంలోని శ్రీ పార్థసారథి స్వామికి పూజలు అనంతరం తదియారాదనలో భక్తులకు ఆహార పొట్లాలను అందజేశారు.

# జడ్పీటీసీ రేసులో ముగ్గురు నారీమణులు

- ఆత్మ కమిటీ చైర్మన్ సహకారంతో రేణుక వైపే మొగ్గు?
- రాయనపేటలో వెలిసిన ప్రచార బ్యానర్లు
- పొత్తుల పై కాంగ్రెస్ శ్రేణుల్లో బిన్నాభిప్రాయాలు



పర్సగాని రేణుక

బోనకల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోనకల్ మండలం జడ్పీటీసీ స్థానం బీసీ మహిళకు రిజర్వు కావడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా ముగ్గురు నారీమణుల పేర్లను స్థానిక నాయకులు అదిష్టానానికి పంపారు. రాయనపేట గ్రామానికి చెందిన పర్సగాని రేణుక, ముష్టికుంట్ల వాసి సురబి నిర్మల, చొప్పకట్లపాలెం నుంచి ఎర్రంశెట్టి శ్రీలత పేర్లను పంపించారు. మండలంలో 36,381 మంది ఓటర్లు ఉండగా బీసీ ఓటర్లు 18,478, ఎస్సీలు 11,260, ఎస్టీలు 1565, జనరల్ క్యాటగిరీ ఓటర్లు 5078 ఉన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రధాన అనుచరుడు, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావుది రాయనపేట గ్రామం కావడంతో ఆయన ఆశీస్సులతో గౌడ సామాజిక వర్గానికి చెందిన పర్సగాని రేణుక పేరు ప్రధానంగా పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీని అంటి పెట్టుకొని కష్టనష్టాలను భరిస్తూ ఆది నుంచి భట్టికి ప్రధాన అనుచరుడిగా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్న ఆత్మ కమిటీ చైర్మన్ తన వంతుగా తమ గ్రామ వాసి రేణుకకు జడ్పీటీసీ టికెట్‌ను ఖాయం చేయించారని ప్రచారం జరుగుతుంది. ఇందులో బాగంగానే గ్రామంలో ఆమె ఫొటోతో జడ్పీటీసీ అభ్యర్థిగా ప్రచార ఫ్లెక్సీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ముష్టికుంట్ల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బందం నాగేశ్వరరావు కుమార్తె నిర్మల గతంలో జడ్పీటీసీగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. మరోసారి బరిలో దిగేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. చొప్పకట్లపాలెం మాజీ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు సతీమణీ శ్రీలత పేరును కూడా పరిశీలనకు పంపారు. మాజీ సర్పంచ్‌కు డిప్యూటీ సీఎం సతీమణీ నందిని ఆశీస్సులు ఉన్నట్లు ప్రచారం జరుగుతో ంది. ముగ్గురి అభ్యర్థులకు సంబంధించి ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నా చివరికి ఆత్మ కమిటీ చైర్మన్ సహకారంతో రేణుక వైపే మొగ్గు చూపుతున్నారని జోరుగా చర్చ సాగుతోంది.

## ఒకే ఒక్కడు



ఏన్కూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లా ఏన్కూరు మండలం శ్రీరాంగిరి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో కేవలం ఒకే ఒక్క విద్యార్థి చదవుతున్నాడు. 5వతరగతి చదవుతున్న బాణాల మహేష్ ఒక్కడే ఉండడం విశేషం. ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన పాఠశాల నేడు విద్యార్థులు లేక కళాహీనమైంది. విద్యార్థుల తల్లిదండ్రులు సంక్షేమ గురుకులాల వైపు మొగ్గుచూపడంవల్ల రానురాను విద్యార్థుల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. 2024 అక్టోబరులో సాదఖున్ ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలు బదిలీపై వచ్చింది. ఆ సమయంలో ముగ్గురు విద్యార్థులండగా ఈ ఏడాది జూన్‌లో ఒకరు, జులైలో మరోకరు గురుకులాలకు వెళ్లడంతో ప్రస్తుతం ఒక్క విద్యార్థి మాత్రమే మిగిలాడు. ఈఒక్క విద్యార్థి కోసం ఉపాధ్యాయురాలు, ఆయా పనిచేస్తున్నారు

### విద్యార్థుల పెంపుపై దృష్టి, ఎంఈవో వాసవీదేవి

విద్యార్థుల పెంపునకు ప్రత్యేక దృష్టి పెట్టాం. పాఠశల బలోపేతానికి ప్రత్యేక కృషి అర్హత కలిగిన టీచర్లు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలి

## జీపీ, మున్సిపల్ వర్కర్ల పెండింగ్ వేతనాలు అందించాలి

- సబ్‌కలెక్టర్‌కు ఏఐటీయూసీ నాయకుల వినతి

కల్లూరు, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) పెండింగ్‌లో ఉన్న జీపీ, మున్సిపల్ వర్కర్ల వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం కల్లూరు సబ్‌కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు మాట్లాడతూ.. గత ఐదు నెలల నుంచి పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందించకపోతే వారి కుటుంబాలను ఏ విధంగా పోషించుకోవాలో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కల్లూరు మండలంలో 9 గ్రామ పంచాయితీలకు ప్రత్యేక అధికారులు లేనందున బడ్జెట ఉన్న ఇంత వరకు వేతనాలు ఇవ్వలేదని అన్నారు. కల్లూరు మునిసిపాలీటీగా ఏర్పడి ఐదు నెలలు కావస్తున్న జీవో ప్రకారం ఐదు నెలల నుంచి వేతనాలు అందడం లేదని అన్నారు. దసరా పండుగను కూడా ఆనందంగా కార్మికులు జరుపుకోలేక పోయారని కనీసం దీపావళి పండుగకైన జీతాలు జమా చేయాలని వారు సబ్‌కలెక్టర్‌ను కోరారు.